నేటి కందం- నేటికి అందం

ప్రచలితముగ వెలుగు భవుని
రచనమ్మగు లోకమందు రంజన గలుగన్
వచియించెద-దర్శింపగ
రుచిరమ్ముగ చెలగెడి నెహురూ జూ పార్కున్ !!
(6-10-1963 హైదరాబాద్ లో నెహ్రూ జూ పార్క్ ప్రారంభం)
-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

చురక

సర్వాంతర్యామి కల్తీ
చొరబడని చోటెక్కడ
దేవుడైనా మనిషైనా
దానికింకా లెక్కెక్కడ
పాలకులే క్విడ్ ప్రోగా
భాగస్తులైతే దందా
అరికట్టి పెట్టగలరా
అక్రమ కల్తీల బొంద
-వేల్పుల నారాయణ
9440433475



website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | ఆదివారం 6-10-2024 | NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 | సంపుటి :31 | సంచిక:56 | పేజీలు:6 | వెల: రూ.1/-


## మూసీ నిర్వాసితులకు రేవంత్ భరోసా

**-ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూపిన తర్వాతే కూల్చివేతల**
**-మీరూ కోరినంత పరిహారం చెల్లిస్తాం**
**-దీని కోసం రూ .10 వేల కోట్లు కేటాయించాం**
**-విపక్షాల మిమ్మలను అడ్డుపెట్టుకని వారి ఆస్తులు కాపాడుకుంటున్నారు**
**-మీరే వారి కుట్రలను బట్టబయలు చేయాలి**
**-జి వెంకటస్వామి జయంతి సభలో రేవంత్ వివరణ**



హైదరాబాద్, అక్టోబర్ 5 : మూసీ ప్రాంతాల్లో ఉన్న వాళ్లు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారికి తగిన ప్రత్యామ్నాయం చూపిన తర్వాత కూల్చివేతలు ప్రారంభిస్తామన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు? చెరువుల్లో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్నవాళ్లు మిమ్మల్ని ఏరకంగా ఆదుకోవాలో ప్రభుత్వానికి సూచన చేయాలని కోరారు. దివంగతనేత గడ్డం వెంకటస్వామి జయంతి సందర్భంగా రవీంద్రభారతిలో నేడు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఈ రోజు మీ దగ్గరకొచ్చి కలిసి మీ సానుభూతి పొందాలనో, లేకపోతే మిమ్మల్ని అడ్డం పెట్టుకుని వాళ్ల ఆస్తులను కాపాడుకోవాలనో ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. వారి కుట్రలను మీరూ బయటపెట్టాలని కోరారు.. కబ్జాల వల్ల మూసీ మూసుకుపోతోందని, అందువల్లే ప్రక్షాళన మొదలుపెట్టామని సీఎం వివరించారు.

### విపక్షాలు మీరూ రండి.. పరిహారం నిర్ణయిద్దాం..

అనంతరం ప్రతిపక్షాలకు సవాల్ విసురుతూ.. అవసరమైతే ఆందోళన చేస్తున్న ప్రతిపక్షాల దగ్గరకే ప్రభుత్వ అధికారులను పంపిస్తామని అంటూ మూసీ బఫర్‌జోన్‌లో, రివర్‌బెడ్‌లో ఉండి ఇళ్లు కోల్పోతున్న వారికి ఎలాంటి నష్టపరిహారం ఇవ్వాలో అక్కడే కూర్చుని ప్రజలను అడిగి వాళ్లే సూచన చేయాలని, అదే తీర్మానాన్ని అసెంబ్లీలో చేద్దామని రేవంత్ సవాల్ విసిరారు.

### లక్ష కోట్లు మింగేశారు.

కాళేశ్వరం పేరుతో ఒక్క కుటుంబమే లక్ష కోట్లు మింగిందని గత కెసిఆర్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు..తాము మాత్రం మూసీ నిర్వాసితులను ఆదుకోవడం కోసం పది వేల కోట్లు ఖర్చు పెట్టేందుకు సిద్దంగా ఉన్నామన్నారు.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల మంచి కోసమే పనిచేస్తోందని, అద్భుతమైన ప్రణాళికలు తీసుకొస్తోందని చెప్పారు . ఇక వెంకటస్వామి గురించి మాట్లాడుతూ, బలహీన వర్గాల కోసం అలుపెరగని పోరాటం చేశారని కొనియాడారు.

### కాకా సేవలు చిరస్మరణీయం-భట్టి

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. కాకా సేవలు చిరస్మరణీయమని అన్నారు.రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు గతంలో కూడా సలహాలు తీసుకున్నామని అన్నారు. కాకా చాలా గొప్ప నాయకుడని అన్నారు. ప్రజా సమస్యల కోసం అహర్నిసలు పాటుపడ్డారని అన్నారు. కాంగ్రెస్? లో అంచెలంచలుగా ఎదిగిన కాకా.. హైదరాబాద్?లో ఉండే నిరుపేదలకు ఆశ్రయం కల్పించిన మహానేత వెంకటస్వామి. కాంగ్రెస్? అధిష్ఠానం కాకాకు బాధ్యత అప్పగిస్తే దానిని తప్పక నెరవేర్చేవారని.. పేదల పక్షాన నిలబడ్డారన్నారు. తాను ఒకటి, రెండు సార్లు కాకాను కలిశానని తెలిపారు.

ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ.. విద్యాసంస్థల ద్వారా అంబేద్కర్ ఆశయాలను కాకా నెరవేర్చారని చెప్పారు. మలి దశ పోరాటంలోనూ ఆయన కృషి మరువలేనిదని, తొలి, మలి దశ ఉద్యమాల్లో కాకా పాత్ర కీలకం అని కోదండరాం కాకా సేవలను కొనియాడారు. ఎన్ని కష్టాలొచ్చినా కాంగ్రెస్?ను వీడలేదని, కాకా జీవితంపై డాక్యుమెంటరీ తేవాలని కోదండరాం అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాజకీయాల్లో కాకా అద్భుత శక్తి అని చెప్పారు.

ఈ కార్యక్రమానికి కాకా కుటుంబం నుంచి ఎమ్మెల్యేలు వివేక్, వినోద్, ఎంపీ వంశీకృష్ణ హాజరయ్యారు. కాంగ్రెస్ సీనియర్ నేతలు, మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. కాకా కుమారుడు, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కాకా సేవలను నేతలు యాది చేసుకున్నారు. కాకాతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

## ఆఫ్రికా దేశంలో మారణహోమం.. గంటల వ్యవధిలోనే 600 మంది ఊచకోత

న్యూఢిల్లీ, అక్టోబర్ 5 : ఆఫ్రికా దేశం బుర్కినా ఫాసో లో భయానక ఘటన వెలుగు చూసింది. బర్సాలోగో పట్టణంలో అల్‌ఖైదా ఇస్లామిక్ స్టేట్ అనుబంధ ఉగ్రసంస్థ జమాత్ నుస్రత్ అల్ ఇస్లామ్ వాల్ ముస్లిమిన్ మిలిటెంట్లు కిరాతకానికి పాల్పడ్డారు. గంటల వ్యవధిలోనే దాదాపు 600 మందిని కాల్చిపారేశారు ( ఆగస్టు 24న జరిగిన ఈ మారణహోమం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

బైక్‌లపై వచ్చిన ఉగ్రవాదులు కనిపించిన వారిని పిట్టల్లా కాల్చి చంపేశారు. మృతుల్లో అత్యధికంగా మహిళలు, చిన్నారులే ఉన్నట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొంది. ప్రాణ భయంతో ప్రజలు పరుగులు పెట్టినా వదిలిపెట్టలేదని.. వారిని వెంబడించి మరీ కాల్పులు జరిపినట్లు తెలిపింది. ఘటన తర్వాత మృతదేహాలను సేకరించేందుకు స్థానిక అధికారులకు మూడు రోజుల సమయం పట్టినట్లు సదరు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి.తొలుత ఈ ఘటనలో 200 మంది మరణించినట్లు ఐరాస అంచనా వేసింది. కానీ, 600 మంది ప్రాణాలు కోల్పోయి ఉంటారని సమాచారం. ఆర్మీ, టెర్రరిస్టులకు మధ్య 2015 నుంచి ఘర్షణలు కొనసాగుతున్నాయి. ఈ ఘర్షణల్లో ఇప్పటి వరకూ 20 వేల మంది ప్రాణాలు కోల్పోయి ఉంటారని గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

## హైడ్రా ఆర్డినెన్స్ కు గవర్నర్ ఆమోదం

హైదరాబాద్ అక్టోబర్ 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: హైదరాబాద్ విపత్తు స్పందన, ఆస్తుల పర్యవేక్షణ, పరిరక్షణ ఏజెన్సీ(హైడ్రా)కి విస్తృతాధికారాలు కల్పిస్తూ ప్రభుత్వం తెచ్చిన ఆర్డినెన్స్ కు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం తెలిపారు. ఈ మేరకు రాజ్ భవన్ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో ఇకపై హైడ్రా చేపట్టనున్న అన్ని కార్యకలాపాలకు చట్టబద్ధత లభించింది. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఈ చట్టాన్ని ప్రవేశపెట్టి ఆమోదిస్తారని తెలుస్తుంది. అంతవరకు ఈ ఆర్డినెన్స్ హైడ్రాకు దన్నుగా ఉండనున్నది.రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, మల్కాజ్గిరి జిల్లాల పరిధిలో ఓఆర్ఆర్ వరకు ఉన్న ప్రాంతాన్ని హైడ్రా పరిధిలో చేర్చారు.

## అనంతగిరి లోయలో బోల్తా పడ్డ వ్యాన్..



హైదరాబాద్, అక్టోబర్ 5 : వికారాబాద్ అనంతగిరి నంది ఘాట్లో వ్యాన్ బోల్తా పడడంతో ఇద్దరి పర్యాటకులకు, డ్రైవర్ కు తీవ్ర గాయాలయ్యాయి.. వికారాబాద్ నుండి తాండూరు వెళ్తున్న ట్రాన్స్ పోర్టు డీసీఎం కిరెల్లి ఘాట్ దిగుతున్న సమయంలో వాహనం అదుపుతప్పి నంది ఘాట్ లోయలకు దూసుకుపోతూ ఇద్దరు పర్యాటకులు ట్రాకింగ్ వెళ్తున్న వారిని ఢీకొంటూ లోయలోకి దూసుకుపోయి బోల్తాపడింది.

వాహనం ఢీకొన్న వారిలో ఓ అమ్మాయికి చెయ్యి విరగ్గా, రమేష్ అనే యువకుడికి వెన్నుపూస దెబ్బతిన్నట్లు వికారాబాద్ ఏరియా హాస్పిటల్ సిబ్బంది పేర్కొన్నారు. గాయాల పాలైన వారు హైదరాబాద్ షేక్పేట్ వారుగా తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఏపీ, తెలంగాణలో భారీ వర్షాలు.. వాతావరణ శాఖ

హైదరాబాద్ అక్టోబర్ 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );బంగాళాఖాతంలో నేడు ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఏపీ, తెలంగాణలో భారీ వర్షం కురియొచ్చని వాతావరణ శాఖ తెలిపింది. రాయలసీమలో భారీ నుంచి అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. తెలంగాణలో రానున్న నాలుగు రోజులు ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

## సీఎం చొరవతో హైదరాబాద్ చేరుకున్న సౌదీ బాధితుడు రాథోడ్ నాందేవ్

**-సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన బాధితుడు రాథోడ్ నాందేవ్**



హైదరాబాద్ అక్టోబర్ 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );కువైట్ – సౌదీ అరేబియా సరిహద్దుల్లోని ఎడారిలో ఒంటెల కాపరిగా కష్టాలు అనుభవించిన నిర్మల్ జిల్లావాసి రాథోడ్ నాందేవ్ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి చొరవతో ఇటీవల రియాద్ నుంచి హైదరాబాద్ కు క్షేమంగా చేరుకున్నాడు. నిర్మల్ జిల్లా ముధోల్ మండలం రూవి గ్రామానికి చెందిన రాథోడ్ నాందేవ్ అనే గిరిజనుడు ఇంటిపని వీసాపై కువైట్ వెళ్లాడు. అరబ్బు యజమాని అతన్ని కువైట్ నుంచి అక్రమంగా సౌదీకి తరలించి ఒంటెల కాపరి పని చేయించాడు. యజమాని హింసను తట్టుకోలేకపోతున్నానని, నిత్యం నరకం అనుభవిస్తున్నానని, ఎడారి నుంచి నన్ను రక్షించండి అంటూ రాథోడ్ నాందేవ్ ఆగస్టులో సీఎం రేవంత్ రెడ్డిని వేడుకుంటూ కన్నీరుమున్నీరుగా విలపిస్తూ పంపిన ఒక సెల్ఫీ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారింది.సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ జీఏడీ ఎన్నారై శాఖ అధికారులు కువైట్, సౌదీ అరేబియా రెండు దేశాల్లోని ఇండియన్ ఎంబసీలతో, అక్కడి సామాజిక సేవకులతో, ఢిల్లీలోని విదేశాంగ శాఖతో సమన్వయం చేసి నాందేవ్ ను రక్షించి స్వదేశానికి వచ్చేలా చేశారు. ఈ సందర్భంగా మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ ఈరవత్రి, కాంగ్రెస్ ఎన్నారై సెల్ నాయకులు మంద భీంరెడ్డి, చెన్నమనేని శ్రీనివాస రావు, స్వదేశ్ పరికిపండ్ల, నంగి దేవేందర్ లతో పాటు గల్ఫ్ బాధితుడు రాథోడ్ నాందేవ్ తన కుటుంబ సభ్యులతో శనివారం ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డిని హైదరాబాద్ లోని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

## డిసెంబర్ నాటికి అర్హులైన పేదలకు ప్రభుత్వ భూములను పంచుతాం

**-మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

నల్లగొండ అక్టోబర్ 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శనివారం నల్లగొండలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధరణి పోర్టల్ లోపాలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. యాచారం, తిరుమలగిరి మండలాలను పైలెట్ ప్రాజెక్ట్ గా ఎంపిక చేసినట్లు తెలిపారు. ధరణి ప్రక్షాళన విషయంలో ప్రతిపక్షాల సలహాలు, సూచనలు స్వీకరిస్తామన్నారు. గతంలో భూమి లేకున్నా పాస్ పుస్తకాలు సృష్టించి 'రైతుబంధు' తీసుకున్నారన్నారు. నిజమైన రైతుకు ప్రయోజనం కలిగించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు.డిసెంబర్ నాటికి అర్హులైన పేదలకు ప్రభుత్వ భూములను పంచుతామని ప్రకటించారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో 5000 ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామన్నారు. తెలంగాణలో త్వరలోనే ఆర్వోఆర్ చట్టం అమల్లోకి రానున్నదన్నారు.అందరి భూ సమస్యలను త్వరగా పరిష్కరిస్తామన్నారు.

## గాంధీ భవన్ లో మహిళ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు



హైదరాబాద్ అక్టోబర్ 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );గాంధీ భవన్ లో మహిళ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి.అంతకు ముందు మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతా రావ్ అధ్యక్షతన మహిళ కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం జరిగింది.అనంతరం ప్రారంభమైన బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. సంబరాలను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ప్రారంబించాగా ఈ సంబరాల్లో రాష్ట్ర ఆరోగ్య శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. పెద్దఎత్తున పాల్గొన్న మహిళలు, సంప్రదాయ బద్ధంగా గౌరమ్మ పూజలు చేసి బతుకమ్మ ఆటలు ఆడారు.ఈ సంబరాల్లో ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రవళి రెడ్డి పాల్గొనగా మహిళ కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా ప్రదాన కార్య దర్శి షేక్ రఫియా బేగం పాల్గొని మత సమరస్యతకు ప్రతీకగా నిలిచారు. వివిడ ప్ర్రాంతలనుంది పెద్ద ఎత్తున మహిలా నాయకుల ు,మహిళలు పాల్గొని బతుకమ్మ సంబరాల్లని జరుపుకున్నారు.దీనితో గాంధీ భవన్ ప్రాంగణం మహిళల ఆట పాటలతో దద్దరిల్లిపోయింది.

## మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య దవాఖానకు దాట్ల ఫౌండేషన్ అంబులెన్స్..!




హైదరాబాద్, అక్టోబర్ 5 : దాట్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్యశాలకు శనివారం అంబులెన్స్ అందజేశారు. బయాలజికల్ ఈ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మహిమా దాట్ల, దాట్ల ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ త్రిశన్య రాజు తదితరులు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రఘునాథ్ స్వామికి 'కేర్ ఆన్ వీల్స్ (మొబైల్ క్లినిక్)' తాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జెనోమ్ వ్యాలీలో ఇంపాక్ట్ గురు ఫౌండేషన్ సీఈఓ సందీప్ తల్వార్ కూడా పాల్గొన్నారు.

## మరోసారి ఢిల్లీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**-రాష్ట్రాల సీఎంలు, హోంమంత్రుల సమావేశానికి హాజరు కానున్న రేవంత్ రెడ్డి**

హైదరాబాద్ అక్టోబర్ 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి ఢిల్లీకి వెళ్లనున్నారు. ఆదివారం ఢిల్లీలో తీవ్రవాద నిరోధంపై కేంద్ర హోంశాఖ నిర్వహించనున్న అన్ని రాష్ట్రాల సీఎంలు, హోంమంత్రుల సమావేశానికి రేవంత్ రెడ్డి హాజరు కానున్నారు. ఈ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రులతో సీఎం భేటీ అయ్యే అవకాశం ఉంది.ఇటీవల వరదల నష్టంతో తెలంగాణకు రూ.10వేల కోట్లకు పైగా నష్టం జరిగినట్లు ప్రభుత్వం కేంద్రానికి నివేదిక అందించగా.. పరిహారంగా కేంద్రం రాష్ట్రానికి కేవలం రూ.421కోట్లు మాత్రమే ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మరింత సాయం చేయాలని సీఎం రేవంత్, కేంద్ర మంత్రులను కోరనున్నట్లు సమాచారం. అలాగే, కాంగ్రెస్ అగ్రనేతలనూ సీఎం రేవంత్ రెడ్డి కలిసే అవకాశం ఉందని తెలుస్తోంది.

## కలుషిత నీరు తాగి 500 మందికి అస్వస్తత

న్యూఢిల్లీ, అక్టోబర్ 5 : కలుషిత నీరు తాగి 500 మంది అస్వస్థతకు గురయ్యారు ఈ ఘటన కర్ణాటక రాష్ట్రం ఉడుపి జిల్లాలో చోటు చేసుకుంది. అస్వస్థతకు గురైన వారిలో ఎవరి పరిస్థితి విషమంగా లేదని జిల్లా ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు.

ఉప్పుండాలో స్థానిక ఓవర్‌హెడ్ ట్యాంక్ నుంచి సరఫరా చేసిన నీరు తాగి దాదాపు 500 మందికిపైగా అస్వస్థతకు గురైనట్లు అధికారులు తెలిపారు. 'ఉడుపి జిల్లాలోని ఉప్పుండాలో స్థానిక ఓవర్‌హెడ్ ట్యాంక్ నుంచి సరఫరా చేసిన కలుషిత నీటిని తాగి 500 మందికి పైగా అస్వస్థతకు గురయ్యారు. అస్వస్థతకు గురైన వారిలో ఎవరి పరిస్థితీ విషమంగా లేదు. రెండు వార్డులకు సరఫరా చేస్తున్న నీటిలో నీటి ద్వారా వ్యాపించే సాల్మోనెల్లా బాసిలరీ స్ట్రెయిన్‌లు ఉన్నట్లు గుర్తించాం' అని జిల్లా ఆరోగ్య అధికారి డాక్టర్ గదాద్ తెలిపారు.


ఆహ్వానము
తెలంగాణ సాహితి
నాగర్‌కర్నూల్ జిల్లా
గుర్రం జాషువా సాహిత్య సమాలోచన
తేది : 08-10-2024, మంగళవారం ఉ|| 10 గం||కు
స్థలం : నేషనల్ హైస్కూల్, నాగర్‌కర్నూల్
అధ్యక్షత : డా. వి.భానుచందర్
జిల్లా అధ్యక్షులు, తెలంగాణసాహితి, నాగర్‌కర్నూల్
వక్తలు : డా. కోయి కోటేశ్వర్ రావు
తెలుగుశాఖాధిపతి, సిటీ కళాశాల హైద్రాబాద్
డా. వెంకట్ పరిమళ్
అసిస్టెంట్ ప్రొఫెసర్, డా.బి.ఆర్.ఆర్.ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జడ్చర్ల
అతిథులు : వల్లభాపురం జనార్థన
రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ సాహితి
పులిజాల పరశురాములు
కె.వి.పి.యస్. జిల్లా కార్యదర్శి, నాగర్‌కర్నూల్
పి. అబ్దుల్ వహీద్‌ఖాన్
రాష్ట్ర కార్యదర్శి, తెలంగాణసాహితి
సామాజిక అంశంపై కవి సమ్మేళనం
ఆహ్వానం : రాము పెరుమాళ్ళు.
వందన సమర్పణ : ఏ. మోతీరాం పవార్
సమన్వయం : జిల్లా కమిటి

# కామ్రేడ్ దిసనాయకెను స్వాగతిస్తున్న సవాళ్ళు

గత రండున్నర ఏండ్లు శ్రీలంక ప్రజాగ్రహజ్వాలలతో భగభగ మండుతుంది. ఆకలి కేకలు విశ్వమంతా వినిపించాయి. అశాంతి మూడు ఉద్యమాలు, ఆరు నిరసనలుగా కొనసాగుతున్నది. రాజకీయ అస్థిరతకు సమాధానంగా ఇటీవల నిర్వహించిన సాధారణ ఎన్నికల్లో నేషనల్ పీపుల్స్ పార్టీ(ఎన్‌పిపి) మార్కిస్ట్ అరుణ తార 56 ఏండ్ల అనుర కుమార దిసనాయకే (ఏకెడి) 9వ అధ్యక్షుడిగా 23 సెప్టెంబర్ 2024న కొత్త ప్రభుత్వం కొలువు తీరింది. 1048లో జరిగిన తీవ్ర ప్రజాఉద్యమాలతో స్వాతంత్ర్యం పొందిన శ్రీలంక ప్రభుత్వం నిర్వహించిన ఎన్నికల్లో తొలిసారి రెండవ/మూడవ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపుతో ఏకెడీ అధ్యక్షుడిగా ఎన్నికైనారు. 1965లో ఏర్పడిన జనతా విముక్తి పెరమున(జెవిపి) లెఫ్ట్ కూటమికి నాయకత్వం వహించిన ఏకెడి నేడు అధ్యక్షుడిగా ఎన్నిక కావడంతో ఓ ప్రజా ఉద్యమానికి ప్రజాస్వామ్య సమాధానం లభించినట్లు అయ్యింది. 1971, 1987-88ల్లో సాయుధ పోరాటాలు చేసిన నాటి మార్కిస్ట్ పార్టీ అరుణ తారల రక్త మరకల చేతిల్లోకి నేడు శ్రీలంక ప్రభుత్వ పగ్గాలు చేరడం విశేషం. 2019-20ల్లో జరిగిన ఎన్నికల్లో కనీసం 3 శాతం ఓట్లు మాత్రమే పొందిన ఎన్‌పిపి నేడు ఏకంగా 43 శాతం ప్రథమ ప్రాధాన్య ఓట్లు పొంది తదుపరి రౌండ్ల లెక్కింపులో అధ్యక్ష పదవికి ఎన్నిక కావడం ఆశ్చర్యకరంగా తోస్తున్నది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎన్‌పిపి ముందంజలో నిలువగా, రెండవ స్థానంలో ఎస్‌జెబీ పార్టీ అభ్యర్థి సజిత్ ప్రేమదాస నిలిచి ప్రతిపక్ష హోదాను దక్కించుతుంది. నిన్నటి వరకు ప్రభుత్వాలను నడిపిన యునైటెడ్ నేషనల్ పార్టీ(యూఎన్‌పి), శ్రీలంక ఫ్రీడమ్ పార్టీ(ఎస్‌ఎల్‌ఎఫ్‌పి)లు విశ్వాసాన్ని కోల్పోయిన వేళ ప్రజల డిమాండ్లకు సరైన సమాధానంగా కామ్రేడ్ ఏకెడి రూపంలో మరో ధ్రువ అరుణ తార కనిపించారు.

**ప్రజాగ్రహంతో దేశం వదిలి పారిపోయిన గోటబాయి రాజపాక్సె:**

2019లో ప్రారంభమైన ఆర్థిక సంక్షోభానికి కారణాలుగా ఆర్థిక లోటు, మితిమీరిన అప్పులు చేసి చెల్లించలేని దుస్థితి, దిగుమతుల మీద మాత్రమే ఆధారపడడం, కరోనా విపత్తు కాటు, రసాయన ఎరువుల దిగుమతుల నిషేధం, అతిగా కరెన్సీ ముద్రణ, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఆహార పదార్థాల తీవ్ర కొరత, పెరిగిన అసమానతలు/పేదరికం లాంటి ప్రధాన అంశాలు పేర్కొనబడ్డాయి. ఏప్రిల్ 2022 నుంచి నిన్నటి వరకు అప్పుల ఊబిలో సతమతం కావడం, అత్యవసర పరిస్థితులు పొడ చూపడం, ఆర్థిక సంక్షోభం ఏర్పడడం, రాజకీయ సామాజిక అస్థిరతతో పాటు పేదల ఆకలి కేకలే పునాదిగా లక్షల మంది శ్రీలంక ప్రజలు రోడ్లపైకి చేరడం (అరగాలయ ఉద్యమం), నాటి శ్రీలంక 8వ అధ్యక్షుడు గోటబయ రాజపాక్సె దేశం వదిలి 13 జూలై 2022న సింగపూర్‌కు పారిపోయి రాజీనామా చేయడంతో రాణిల్ విక్రమసింఘె నేతృత్వంలో 12 మే 2022న ప్రభుత్వం ఏర్పడడం లాంటి వివరాలు మనకు తెలుసు.

**అనుర కుమార దిసనాయకె ముందున్న సవాళ్ళు:**

నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన అనుర కుమార దిసనాయకె ఎన్నిక కావడానికి కారణమైన పలు ఎన్నికల హామీలను ఒక్కొక్కటి అమలు పరచాల్సి ఉంది. అవినీతి రహిత పాలన, అసమానతల తగ్గింపు, వ్యవస్థలో సమూల మార్పులు, పేదల పక్షపాత ప్రభుత్వ విధానాలను క్షేత్రస్థాయిలో సత్వరమే అమరులు చేయాల్సిన గురుతర బాధ్యత ఉన్నది. హామీలను అమలు పరుస్తూ శ్రీలంకన్ ప్రజల మెప్పును పొందడం అంత సులభమేమీ కాదని అధ్యక్షుడు ఏకెడీకి కూడా తెలుసు. ముగ్గురు మంత్రులతో కూడిన నూతన ప్రభుత్వం ప్రస్తుత పార్లమెంట్‌ను రద్దు చేసి తిరిగి నవంబర్ 2024లో పార్లమెంట్ ఎన్నికలకు పోవచ్చని తెలుస్తున్నది. 24 సెప్టెంబర్ 2024న ప్రధానిగా హరిణి అమరసూరియ పదవీబాధ్యతలు స్వీకరించిన విషయం మనకు తెలుసు. నేడు 113 మంది సభ్యులు కలిగిన పార్లమెంట్‌లో ఎన్నికల తర్వాత మెజారిటీ కూడా పొందవలసిన పెద్ద సవాళు ఆయన ముందున్నది. సింహలీ ఓటర్లలో పట్టున్న అనుక కుమార దిసనాయకె కూటమి పార్టీకి వ్యతిరేకంగా గ్రామీణ ప్రజలు, తమిళ జాతులు, మలయహ (కొండ ప్రాంత) తమిళులు, ముస్లిమ్ మైనారిటీలు ఉంటూ వస్తున్నారు. అనాదిగా అవినీతిలో కూరుకు పోయిన ప్రభుత్వ వ్యవస్థను గాడిలో పెట్టడం హామీలు గుప్పించినంత సులభమేమీ కాదు. అప్పుల ఊబిలో మునిగిన శ్రీలంకను బయట పడేయడంతో పాటు విదేశీ అప్పుల చెల్లింపుల సంక్షోభం నుంచి ఉపశమనం, ద్రవ్యోల్బణాన్ని గాడిలో పెట్టడం ప్రధాన కర్తవ్యంగా ఏకెడీ భావించాలి. సామాజిక న్యాయం, అందరికీ రెండు పూటల అన్నం, నిత్యవసరాల అందుబాటు లాంటి అంశాలను అమలు చేయాల్సి ఉంది. సామాన్యుల పక్షపాతిగా పోరాటాలు చేస్తూ వచ్చిన ఏకెడి నేడు అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని తాను కోరుకున్న 'నిజమైన మార్పు(జెన్విన్ ఛేంజ్)'కు ప్రాణం పోయాల్సి ఉంటుంది.

**ఏకెడి ప్రభుత్వంతో భారత్‌కు ముప్పు ఉందా !**

ఇప్పటి వరకు లంకతో భావోద్వేగ, చారిత్రక సత్సంబంధాలను కలిగి ఉన్న భారత్ అదే విధమైన స్నేహపూర్వక సంబంధాలను కోరుకుంటున్నది. చైనాకు అనుకూలంగా ఉంటూ ఎదిగిన ఏకెడి కమ్యునిష్ట్ ప్రభుత్వం నేడు ఇండియా లాంటి దేశాలతో కూడా సాధారణ సంబంధాలను కొనసాగించడం కనీస అవసరంగా గుర్తించాలి. అధిక మొత్తంలో రుణాలను కల్పించిన చైనాతో 'స్ట్రింగ్ ఆఫ్ పెరల్స్(ముత్యాల తీగ)' గుప్పిట్లోకి శ్రీలంక చేరితే భారత భద్రతకు ముప్పు వాటిల్లనుందని కూడా అంచనా వేస్తున్నారు. ఇప్పటి వరకు తమిళ జాతులు, ముస్లిమ్ మైనారిటీలకు దూరంగా ఉంటూ వచ్చిన ఏకెడి నేడు వారి హక్కులను కాపాడుతూ ఆ వర్గాల విశ్వాసాన్ని కూడా పొందాల్సిన కనీస అవసరం ఉంది. భారత్ చుట్టు ఉన్న శ్రీలంక, బంగ్లాదేశ్, మాల్దీవులు, నేపాల్, పాకిస్థాన్ లాంటి దేశాలపై చైనా ప్రభావం పెరగడంతో హిందూ మహాసముద్రంలో పట్టును నిలుపుకుంటూ భారతమాత ఇరుగుపొరుగు పోరు దేశాల మనసును పసిగట్టి ముందుకు సాగాల్సిన అగత్యం ఏర్పడింది.

కామ్రేడ్ అనుకర కుమార దిసనాయకె అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత నేడు మరో అసలైన అగ్ని పరీక్షను ఎదుర్కోనున్నారు. ఎన్నికల ప్రచారంలో వాగ్దానాల వరదలు గుప్పించడం సర్వసాధారణం. శ్రీలంక ప్రజలు పెట్టిన తొలి ఎన్నికల పరీక్షలో ఏకెడి నెగ్గినా, రానున్న అసలైన వాగ్దానాల అమలు పరీక్షలో పాస్ మార్కులైనా సాధించాల్సి ఉంటుంది. దేశ పరిమిత వనరుల ముందు లక్ష్యాలు చాలా పెద్దవి. ప్రజల మనసులను గెలవడానికి ఎంతో శ్రమించాల్సి ఉంటుంది. ఇన్నాళ్లు కమ్యునిష్ట్ నేతలుగా చేసిన పోరాటాలకు నేడు పరిష్కారాలు చూపాల్సిన బాధ్యత ఏకెడి ప్రభుత్వానికి ఉన్నది. పేదరిక నిర్మూలన, అసమానతల తగ్గింపు, విదేశీ అప్పుల చెల్లింపు, ఆహార ధాన్యాల సరఫరా, ధరల తగ్గింపు లాంటి తీవ్ర సమస్యలకు సత్వర పరిష్కారాలు చూపితేనే ఏకెడి పాలనపై ప్రజలకు నమ్మకం పెరుగుతుంది. నేటి శ్రీలంక సంక్షోభానికి త్వరలో శాంతియుత పరిష్కారం దొరకాలని కోరుకుందాం.

– డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# 'స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడంలో ఆధ్యాత్మికత్వం అండదండలు' అనే అంశంపై ప్రపంచ స్థాయి శిఖరాగ్ర సమావేశం

న్యూఢిల్లీ, అక్టోబర్ 5 : 'స్వచ్ఛమైన, ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడంలో ఆధ్యాత్మి కత్వం అండదండలు' ఇతివృత్తంతో నిర్వహించిన ప్రపంచ స్థాయి శిఖరాగ్ర సమావేశంలో రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము పాల్గొన్నారు. ఈ సమావేశాన్ని ప్రజాపతి బ్రహ్మ కుమారీల ఈశ్వరీయ విశ్వ విద్యాల యం రాజస్థాన్ లోని మౌంట్ అబూ లో ఈ రోజు ఏర్పాటు చేసింది.

ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ప్రసంగిస్తూ, ఆధ్యాత్మికత్వం అంటే ధర్మపరంగా నడచుకోవడమో లేదా ప్రాపంచిక కార్యకలాపాలను వదలి పెట్టేయడమో కాదన్నారు. ఆధ్యాత్మికత్వం అంటే మన లోపల ఉన్న శక్తిని గుర్తించడం, మన నడవడికలో, మన ఆలోచనలలో పవిత్రత్వానికి ప్రాధాన్యాన్ని ఇవ్వడం అని అర్థం అని ఆమె అన్నారు. భావాలలో స్వచ్ఛత తో పాటు మనం చేసే పనులలో నిష్కల్మషత్వం.. వీటి సాయంతో జీవనంలో మనం వేసే ప్రతి అడుగులోనూ పట్టు తప్పిపోకుండా నడుస్తూ, మనస్సులో నెమ్మదిగా ఉంటూ మనుగడను సాగించాలని ఆమె అన్నారు. స్వచ్ఛమైనటువంటి, ఆరోగ్యవంతమైనటువంటి సమాజాన్ని నిర్మించడానికి కూడా ఇది అవసరమే అని రాష్ట్రపతి అన్నారు.

శారీరకంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా స్వచ్ఛతను కలిగివుంటే ఆరోగ్య ప్రదమైన జీవనాన్ని గడవగలుగుతాం అని రాష్ట్రపతి అన్నారు. మనం బాహ్య స్వచ్ఛత పైనే దృష్టిని కేంద్రీకరించకూడదని, మానసికంగా, ఆధ్యాత్మికత్వం పరంగా కూడా నిర్మలత్వంతో నడుచుకోవాలి అని ఆమె అన్నారు. మన మనస్తత్వం పరిశుభ్రంగా ఉందా లేదా అన్నదానిపైనే మనం ఎంతగా స్వస్థంగా ఉండగలం అన్నది ఆధారపడి ఉంటుందన్నారు. మనం ఏమి ఆలోచిస్తామన్న దానిని బట్టే మన ప్రవర్తన, మనం ఆడే మాటలు ఉంటాయి; ఈ కారణంగా మన ఆలోచనలు సరి అయినవిగా ఉన్నాయంటే అప్పుడు మనం మానసికంగాను, భావోద్వేగాల పరంగాను ఆరోగ్యంగా ఉంటాం. ఇతరులను గురించి ఒక అభిప్రాయాన్ని ఏర్పరచుకొనే ముందు మనం మన అంతరంగంలోకి తొంగి చూసుకోవాలి. ఎవరికో ఎదురైన స్థితి మనకు ఎదురైతే అని తలపోసినప్పుడు, మనం సరి అయినటువంటి అభిప్రాయాన్ని ఏర్పరచుకొనే స్థితిలో ఉండగలం అని ఆమె అన్నారు.

ఆధ్యాత్మికత అనేది వ్యక్తిగత ఎదుగుదలకు తోడ్పడే ఒక సాధనం మాత్రమే కాదని, అది సంఘంలో ఒక సానుకూల మార్పును తీసుకువచ్చే మార్గం అని రాష్ట్రపతి అన్నారు. మనం మన అంతరంగంలోని పరిశుద్ధతను గుర్తించినప్పుడే ఆరోగ్యకరమైన, శాంతియుక్తమైన సమాజాన్ని ఆవిష్కరించడానికి తోడ్పడగలం అని ఆమె అన్నారు. సమాజానికి సంబంధించిన, భూమికి సంబంధించిన అనేక అంశాలకు.. ఉదాహరణకు కు సుస్థిరాభివృద్ధి, పర్యావరణ సంరక్షణ, సామాజిక న్యాయం వంటి అంశాలకు.. బలాన్ని ఆధ్యాత్మికత్వం అందిస్తుందని రాష్ట్రపతి అన్నారు.

రకరకాల వస్తువుల ను సొంతం చేసుకొని, వాటి పట్ల ప్రీతిని కలిగివుండడం అనేది మనకు క్షణికమైన భౌతిక, మానసిక సంతోషాన్ని కలిగిస్తుంది, దీనినే నిజమైన ఆనందం అని మనం అనుకొని, దీనితో పెనవేసుకపోతాం అని రాష్ట్రపతి అన్నారు. ఈ బంధం మనలో అసంతృప్తిని, దుఃఖాన్ని జనింపచేస్తుంది. మరో పక్క, ఆధ్యాత్మికత మన గురించి మనం తెలుసుకొనే, మన అంతరంగాన్ని మనం గుర్తెరిగే అవకాశాలను ప్రసాదిస్తుంది అని రాష్ట్రపతి అన్నారు

వర్తమాన ప్రపంచంలో శాంతికి, ఏకత్వానికి ప్రాముఖ్యం మరింత పెరిగిపోయింది అని రాష్ట్రపతి అన్నారు. మనం శాంతిగా ఉంటేనే ఇతరుల పట్ల సానుభూతిని, ప్రేమను చాటగలుగుతాం. యోగా చెప్పే విషయాలు,కుమారీల వంటి ఆధ్యాత్మిక సంస్థలు మనం మన మనస్సులో శాంతిని ఏర్పరచుకొనేందుకు తోడ్పడుతాయి. ఈ శాంతి ఒక్క మన లోపల సానుకూల పరివర్తనను తేవడమే కాకుండా పూర్తి సమాజంలో సైతం సానుకూల పరివర్తనను కొనితేగలదని రాష్ట్రపతి అన్నారు.

# మరోసారి మానవత్వం చాటుకున్న సీఎం చంద్రబాబు




అమరావతి, అక్టోబర్ 5 : శనివారం ఉదయం తిరుమల తిరుపతి రెండు రోజుల పర్యటన ముగించుకుని తిరుగు ప్రయాణంలో రేణిగుంట విమానాశ్రయంలో తనను ప్రాణంగా అభిమానించే అభిమానిని కలిసి అతని చిరకాల ఆకాంక్షను నెరవేరుస్తూ తానున్నానని భరోసా కల్పిస్తూ అతని ఆరోగ్యం మెరుగుదలకు ఐదు లక్షల రూపాయల తక్షణ ఆర్థిక సాయం ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అందజేసి మరో మారు మానవత్వం చాటుకున్నారు.

తమ నాయకుడితో ఫోటో దిగాలని ఎప్పటి నుండో అనుకుంటున్న ఓ అభిమాని కోరికను తీర్చారు చంద్రబాబు నాయుడు. అంతేకాదు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న అభిమాని వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం అందించారు.

వివరాల్లోకి వెళితే? రేణిగుంటకు చెందిన పసుపులేటి సురేంద్రబాబు(30) మానసిక దివ్యాంగుడిగా జన్మించారు. దీనికి తోడు ఇటీవల లివర్ కేన్సర్ తోడైంది. సురేంద్ర బాబుకు చంద్రబాబు అంటే చిన్నతనం నుండే అంతులేని అభిమానం అమితమైన ప్రేమ. తాను ఎంతో ఇష్టపడే నాయకుడైన చంద్రబాబుతో చనిపోయే లోపు ఒక్క ఫోటోనైనా దిగాలన్నది సురేంద్ర బాబు వాంఛ. ఈ విషయం చంద్రబాబుకు తెలిసింది.

బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించి వస్తున్న సమయంలో ఎయిర్ పోర్టుకు పిలిపించుకుని సురేంద్ర బాబుతో ప్రత్యేకంగా మాట్లాడి ఫోటో దిగారు. క్యాన్సర్ తో బాధపడుతున్నందున వైద్య ఖర్చులకు రూ. 5లక్షలను ప్రభుత్వం తరపున సాయం అందించారు. భయపడొద్దని, అన్ని విధాలా అండగా ఉంటానని సురేంద్రబాబుకు సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చారు. తన అభిమాన నేత ఆప్యాయతతో పలకరించడంతో సురేంద్రబాబు ఎంతో సంతోషించాడు.



# బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యాలయ ప్రాంగణాన్ని సందర్శించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి: స్పెషల్ క్యాంపెయిన్ 4.0 అమలు ప్రారంభం

న్యూఢిల్లీ, అక్టోబర్ 5 : స్పెషల్ క్యాంపెయిన్ 4.0 అమలు దశ ప్రారంభం సందర్భంగా బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యాలయ ప్రాంగణాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ వి.ఎల్.కాంతారావు, అదనపు కార్యదర్శులు శ్రీమతి విస్మితా తేజ్, శ్రీమతి రూపిందర్ బ్రార్, ఇతర సీనియర్ అధికారులు కేంద్ర మంత్రి వెంట ఉన్నారు. పరిశుభ్రత, మొత్తం పనివాతావరణాన్ని మదింపు చేయడం ఈ సందర్శన లక్ష్యం. ఇది ప్రభుత్వ కార్యకలాపాల్లో ఉన్నత ప్రమాణాలను పాటించడంపై ప్రత్యేక ప్రచారం ప్రాధాన్యతను ప్రతిబింబిస్తుంది. స్వచ్ఛత (పరిశుభ్రత) ప్రభుత్వ కార్యక్రమాలలో పెండింగ్ ను తగ్గించాలన్న బలమైన సంకల్పంతో 2024 అక్టోబర్ 2 నుండి అక్టోబర్ 31, 2024 వరకు నడిచే ప్రత్యేక ప్రచారం (స్పెషల్ క్యాంపెయిన్) 4.0 ని ప్రభుత్వం ప్రారంభించింది. కార్యాలయ స్థలాలను పెంచడం, ఆధునిక పరిశుభ్రత పద్ధతులను అవలంబించడం, సమర్థమంతంగా వ్యర్థాలను తొలగించడం, స్థలాన్ని పూర్తిగా వినియోగించేలా చేయడం, డిజిటలైజేషన్ ను, పర్యావరణ అనుకూల పద్ధతులను ప్రోత్సహించడం, వ్యర్థాలను సంపదగా మార్చడం, సమ్మిళితను పెంపొందించడం, పౌరుల అవసరాలపై దృష్టి కేంద్రీకరించే విధానాలకు ప్రాధాన్యత ఇవ్వడం , ప్రోటోకాల్స్, యంత్రాంగాలను బలోపేతం చేయడం ప్రత్యేక ప్రచారం 4.0 ముఖ్య లక్ష్యాలు.

ఈ తనిఖీ సందర్భంగా మంత్రి శ్రీ కిషన్ రెడ్డి వ్యర్థ పదార్థాలతో వినూత్న ఆర్ట్ బాక్స్ ను రూపొందించిన ఉద్యోగిని ప్రత్యేకంగా అభినందించారు. ఆ ఉద్యోగి సృజనాత్మకతను, నైపుణ్యాన్ని మంత్రి ప్రశంసించారు, రీ సైక్లింగ్, దైనందిన కార్యకలాపాల్లో సుస్థిర విధానాల ప్రాముఖ్యతను ప్రత్యేకంగా ప్రస్తావించారు. వ్యర్థాల తగ్గింపు, పర్యావరణ సుస్థిరతకు దోహదం చేస్తూ పని ప్రాంతం సౌందర్యాన్ని పెంపొందించే సృజనాత్మక పరిష్కారాలను కనుగొనాలని ఆయన సిబ్బందికి సూచించారు.

# 'మహారాష్ట్ర ప్రభుత్వ 'నమో షెట్కరీ మహా సమ్మాన్ నిధి యోజన' 5వ విడత నిధుల పంపిణీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 5 : ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ, మహారాష్ట్ర వాషింలో అక్టోబర్ 5న 'ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి' ('పీఎం-కిసాన్') 18వ విడత నిధులను విడుదల చేస్తారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా, సుమారు 20,000 కోట్ల రూపాయల సొమ్ము, నేరుగా రైతుల ఖాతాల్లోకి జమ చేసే ఈ ప్రత్యక్ష నగదు బదిలీ పథకం వల్ల, దేశంలోని 9.4 కోట్ల రైతులు లబ్ధి పొందుతారు.

కార్యక్రమానికి మహారాష్ట్ర గవర్నర్ శ్రీ సీ పీ రాధాకృష్ణన్, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్ర మత్స్య, పశు సంవర్ధక, పాడిపరిశ్రమ శాఖ మంత్రి శ్రీ రాజీవ్ రంజన్ సింగ్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఏక్ నాథ్ షిండే, ఉప ముఖ్యమంత్రులు శ్రీ అజిత్ పవార్, శ్రీ దేవేంద్ర ఫడ్నవీస్ సహా ఇతర ప్రముఖులు పాల్గొంటారు. రాష్ట్ర మృత్తిక, జల సంరక్షణ శాఖ మంత్రి వాషిం, యవత్మల్ జిల్లాల ఇన్చార్జి మంత్రి కూడా అయిన శ్రీ సంజయ్ రాథోడ్ కూడా కార్యక్రమంలో పాల్గొంటారు. 732 'కృషి విజ్ఞాన్ కేంద్రాల' రైతులు సహా దాదాపు 2.5 కోట్ల రైతన్నలు, ఒక లక్ష ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, 5 లక్షల సాధారణ సేవల కేంద్రాలు (కామన్ సర్వీస్ సెంటర్లు) వెబ్ కాస్ట్ పద్ధతి ద్వారా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. నిధుల విడుదలను పురస్కరించుకుని, 'పీఎం-కిసాన్ ఉత్సవ్ దివస్' పేరిట వివిధ రాష్ట్రాలూ కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు అవుతున్నాయి.

2019 ఫిబ్రవరి 24న ప్రారంభమైన 'పీఎం-కిసాన్' పథకం సొంత భూమి ఉన్న రైతులకు మూడు సమాన వాయిదాల్లో దాదాపు 6,000 రూపాయలను అందిస్తోంది. అక్టోబర్ 5న ప్రధానమంత్రి 'పీఎం-కిసాన్' 18వ విడత నిధులను విడుదల చేస్తారు. ఈ 18వ కోటా నిధుల విడుదలతో మొత్తం పంపిణీ సొమ్ము 3.45 లక్షల కోట్లకు చేరుకుంటుంది. 11 కోట్ల వ్యవసాయదారులు పథకం వల్ల లబ్ధి పొందుతున్నారు. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయరంగ సుసంపన్నం పట్ల ప్రభుత్వానికి గల నిబద్ధతకు ఈ పథకం అద్దం పడుతోంది.పథకం కింద మహారాష్ట్రలోని 1.20 కోట్ల రైతన్నలకు 17 వాయిదాల్లో 32,000 కోట్ల రూపాయల సొమ్ము అందింది. పెద్దమొత్తంలో సొమ్ము అందుకున్న రాష్ట్రంగా మహారాష్ట్ర రెండో స్థానంలో నిలిచింది. 18 వ విడత నిధుల విడుదల వల్ల మొత్తం రూ.1900 కోట్ల సొమ్మును 91.51 లక్షల రైతులకు పంపిణీ చేస్తారు.

రాష్ట్ర రైతులకు మరింత లబ్ధి చేకూరేలా 'పీఎం-కిసాన్' నిధుల విడుదల సహా 'నమో షెట్కారీ మహా సమ్మాన్ నిధి యోజన' పథకం 5వ విడత తాలూకు 2,000 కోట్ల రూపాయలను కూడా ప్రధాని విడుదల చేస్తారు. వ్యవసాయ మౌలిక వసతులను మెరుగుపరిచే లక్ష్యంగా, నూతన ప్రభుత్వం తొలి వంద రోజుల్లో, అగ్రికల్చర్‌‌ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ ? 'ఏఐఎఫ్' కింద అభివృద్ధి పరచిన వివిధ ప్రాజెక్టులను ప్రధాని జాతికి అంకితం చేస్తారు. 2020లో ప్రారంభించిన 'ఏఐఎఫ్' నిధి, పంటకాలం పూర్తయ్యాక అవసరమైన నిల్వ, మార్కెటింగ్ తదితర సౌకర్యాల మెరుగుదల, వ్యవసాయ ఆస్తుల నిర్వహణను మరింత సమర్థవంతంగా చేసేందుకు అవసరమైన మధ్యకాలిక, దీర్ఘకాలిక రుణాలను అందిస్తుంది. ఈ పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు లక్ష కోట్ల రూపాయల వరకూ రుణ సదుపాయం సహా రుణ గ్యారంటీ, వడ్డీ సొమ్ముపై 3% వరకూ ప్రభుత్వ సహాయం లభ్యమవుతాయి. గత 100 రోజుల్లో, 6,541కోట్ల రూపాయల మేర, 10,066 వ్యవసాయ మౌలిక వ్యవస్థల ప్రాజెక్టులు మంజూరయ్యాయి. వీటిలో 97.67 కోట్ల రూపాయల నిధులు 101 ఎఫ్పీఓలకు మంజూరయ్యాయి. 1,929 కోట్ల రూపాయల ఖర్చుతో చేపట్టిన 7,516 ప్రాజెక్టులు పూర్తయ్యాయి, ఇందులో 13.82 కోట్ల విలువైన 35 ఎఫ్పీఓలను రేపు జాతికి అంకితం చేస్తారు. ఈ ప్రాజెక్టులన్నీ వ్యవసాయ రంగంలోని నిల్వ సామర్థ్య పెంపు, ఆహారశుద్ధి, మార్కెట్ రవాణా తదితర మౌలిక వ్యవస్థలను బలోపేతం చేస్తూ ఎఫ్పీఓల స్థాయిని పెంచుతున్నాయి. తద్వారా రైతులు, వ్యవసాయ రంగం లాభపడుతోంది.

బలమైన రవాణా వ్యవస్థను ఏర్పరిచి, భూమిలేని, చిన్న సన్నకారు రైతులకు అండగా నిలవాలన్న ఆశయంతో, దేశంలోని అన్ని బ్లాకుల్లో 10,000 ఎఫ్పీఓల ప్రారంభం కోసం, ప్రభుత్వం కేంద్రీయ రంగ పథకం ? 'సీఎస్ఎస్' ను ప్రారంభించింది. ఇప్పటి వరకూ ఏర్పడ్డ 9,200 ఎఫ్పీఓల ద్వారా, 8.3 లక్షల మంది మహిళలు, 5.77 లక్షల షెడ్యూల్డ్ కులాలు, తరగతుల వారు సహా 24 లక్షల మంది రైతులు లబ్ధి పొందారు. ప్రస్తుతం, ఈ ఎఫ్పీఓల మొత్తం వార్షిక ఆదాయం 1,300 కోట్లకు చేరుకుంది. కార్యక్రమం సందర్భంగా ప్రధాని ఈ ఎఫ్పీఓలను కూడా జాతికి అంకితమిస్తారు.


ప్రధానమంత్రి ఆశయాలైన 'మేకిన్ ఇండియా', 'ఆత్మనిర్భర్' సాకారం దిశగా, ఇదే కార్యక్రమంలో, పశువుల పునరుత్పత్తి ప్రక్రియకు సంబంధించిన స్వదేశీ 'లింగ-నిర్ధారణ వీర్య సాంకేతికత'ను ప్రారంభిస్తారు. అందుబాటు ధరలో ఉండే ఈ సాంకేతికత, పాడి రైతులకు లాభసాటిగా ఉండే పశువుల జననంలో ఉపకరించడమే కాక, డోసుకు రెండు వందల రూపాయల మేర ఖర్చుని కూడా తగ్గిస్తుంది. పశు సంవర్ధక, పాడి పరిశ్రమ విభాగం-'డీఏహెచ్డీ' అభివృద్ధి పరిచిన 'ఏకీకృత జీనోమిక్ చిప్' ను కూడా శ్రీ మోదీ ప్రారంభిస్తారు. ఇందులో 'గౌ' చిప్ ఆవులకు, 'మహిష్' చిప్ గేదెల కోసం నిర్దేశించినవి. భారతీయ పశు జాతులను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పరిచిన ఈ సాంకేతికత, పాడి రైతుల అవసరాలకు తగ్గ పశువులను ఎంపిక చేసుకోవడంలో, మేటి ఎద్దులను చిన్న వయసులోనే గుర్తించి, వాటిని తదనుగుణంగా పాడిలో వినియోగించుకోవడంలో సహాయకారిగా ఉంటుంది. సౌరశక్తి ప్రాజెక్టులు 'కుసుమ్-సీ', 'ఎంఎస్కేవీవై 2.0' పథకాలకు సంబంధించి 3,000 మెగావాట్ల ప్రాజెక్టులకు పురస్కార పత్రాల ప్రదాన కార్యక్రమ ప్రారంభం, గ్రామ పంచాయితీలకు సామాజిక అభివృద్ధి నిధుల విడుదలను వీడియో మాధ్యమం ద్వారా శ్రీ మోదీ ప్రారంభిస్తారు. 'ఎంఎస్కేవీవై 2.0' పథకంలో భాగమైన 19 మెగావాట్ల ఐదు సౌరశక్తి పార్కులను ప్రధాన మంత్రి జాతికి అంకితం చేస్తారు. దాంతో, పర్యావరణ-హిత, అందుబాటు ధరల్లో విద్యుత్తు లభించడమే కాక, రైతులకు పగటిపూట కూడా విద్యుత్తు అందుబాటులోకి వస్తుంది, తమ భూములను లీజుకి ఇవ్వడం ద్వారా అదనపు ఆదాయాన్ని వారు సమకూర్చుకోగలుగుతారు.

# మహబూబ్ నగర్ జిల్లా గ్రంథాలయానికి పుస్తకాలు అందజేత




మహబూబ్‌నగర్, అక్టోబర్ 5 : మహబూబ్ నగర్ జిల్లా గ్రంథాలయానికి ప్రముఖ కవి, పాలమూరు సాహితి అధ్యక్షులు డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ దాదాపు ఐదువేలకు పైగా పుస్తకాలను ఉచితంగా అందజేశారు. అక్టోబర్ 4 న జిల్లా కేంద్ర గ్రంథాలయంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ డాక్టర్ రియాజ్ సమక్షంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి మనోజ్ కుమార్ ను కలిసి పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ శ్యాంసుందర్, గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వెంకటస్వామి(కాకా)85వ జయంతి వేడుకలు



ఖమ్మం, అక్టోబర్ 5 :(నేటినిజం ప్రతినిధి): స్వాతంత్ర్య సమరయోధుడు,కేంద్ర మాజీ మంత్రి స్వర్గీయ గడ్డం వెంకటస్వామి(కాకా) 85వ జయంతి సందర్భంగా ఖమ్మం జిల్లా మాల మహానాడు ఆధ్వర్యంలో ఖమ్మం నగరం రేవతి సెంటర్ లో ఆ మహానాయకుడికి ఘనంగా నివాళులు అర్పించారు. తెలంగాణ తొలి,మలిదశ ఉద్యమకారుడిగా, సింగరేణి బాంధవుడిగా,కార్మిక పక్షపాతిగా వెంకటస్వామి ఎనలేని సేవలు అందించారని దామళ్ల సత్యం ఆయన సేవలను కొనియాడి స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా కన్వీనర్ దామళ్ళ సత్యం, ప్రెసిడెంట్ పెరం మల్లయ్య, అధికారప్రతినిధి గొట్టెముక్కల శ్రీను, మహిళా అధ్యక్షురాలు కొమరబత్తిన కాంతమ్మ, రాజు, వెంకట్, రాములు, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# మలబద్ధకానికి బద్ధకం వస్తే - సమస్యగానే పరిగణించాలి

## -ప్రభుత్వ నర్సింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లిల్లీ మేరి

సిద్దిపేట అక్టోబర్ 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : వయసు మీద పడిన వారిలో మలబద్ధకం ఎక్కువ. సాధారణంగా వారానికి మూడు కన్నాతక్కువ సార్లు విరోచనం కావటాన్నిమలబద్ధకంగా భావిస్తుంటారు. అయితే ఎన్నిసార్లు విసర్జనకు వెళ్తున్నారనేది వ్యక్తులను బట్టి మారిపోతుంది. కొందరు రోజులో చాలాసార్లు విసర్జనకు వెళ్లొచ్చు. కొందరికి వారానికి ఒక ట్రెండు సార్లు విరోచనం కావచ్చు. తీరు ఏదైనా కానీ మునుపటి కన్నా తక్కువసార్లు విరోచనం అవుతున్నా, విసర్జనకు కష్టపడుతున్నా, మలంగట్టిగా, పొడిగా వస్తున్నా, నొప్పి పుడుతున్నా, పూర్తిగా విసర్జన కాలేదని అనిపిస్తున్నా సమస్యగానే పరిగణించాల్సి ఉంటుందని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లిల్లీ మేరి అన్నారు.

ఏమిటి సమస్య..

మలబద్ధకానికి మూలం పెద్ద పేగు మనం మలంలోని నీటిని మరీ ఎక్కువగా సంగ్రహించుకోవటం. మనం తిన్న ఆహారం జీర్ణ కోసంలోకి ముందుకు సాగుతున్నప్పుడు పేగులు నెమ్మదిగా పోషకాలను గ్రహించుకుంటాయి. పాక్షికంగా జీర్ణమైన ఆహారం చిన్నపేగులనుంచి పెద్ద పేగులోకి వెళ్లి, మలంగా ఏర్పడుతుంది. పెద్దపేగు దీనిలోని నీటిని గ్రహించుకుని మరింత గట్టి పడేలా చేస్తుంది. మలబద్ధకం గల వారిలో జీర్ణం కోసం ఆహారం నెమ్మదిగా కుదులుతుంది. దీంతో నీటిని సంగ్రహించుకోవడానికి పెద్ద పేగుకు ఎక్కువ సమయం లభిస్తుంది. ఫలితంగా మలం పొడిగా, గట్టిగా అవుతుంది.

ఎందుకీ బద్ధకం..

మలబద్ధకానికి జీవన విధానం, మందులు, జబ్బులు వంటి అంశాలెన్నో కారణం అవుతాయి. ఆహారనీలో తగినంత పీచు పదార్థం లేకపోవడం, సరిపడినంత నీరు తాగకపోవడం, వ్యాయామం, శారీరక శ్రమ అంతగా చేయకపోవడం. దినచర్య మారటం. అంటే ప్రయాణాలు చేయడం, భోజనం చేయకపోవడం, నిద్రించే వేళలు మారటం వంటివి. మానసిక ఒత్తిడి, విరోచనం అయ్యేట్టు అనిపించినా ఆపటం. నొప్పి, కుంగుబాటు, చాతివంట అలర్జీ తగ్గించే మందులు. ఐరన్ మాత్రలు క్యాల్షియం ఛానెల్ బ్లాకర్ల వంటి కొన్ని రకాల అధిక రక్తపోటు మందులు, మానసిక జబ్బులు, మూర్ఛ మందులు. హైపోథైరాయిడిజం, మధుమేహం, రక్తంలో కాల్షియం ఎక్కువగా ఉండటం, పెద్ద పేగు క్యాన్సర్, పేగు పూత, పెద్ద పేగులో తిత్తులు వంటి జబ్బులు.

తగ్గించుకునే మార్గమేది..

వృద్ధుల్లో మలబద్ధకం ఎక్కువే అయినా కొన్ని జాగ్రత్తలతో దీన్ని నివారించవచ్చు. నీరు తాగటం చాలా ముఖ్యం. వృద్ధులు రోజుకు కనీసం ఆరు గ్లాసుల నీరు, ద్రవాలు తీసుకోవడం మంచిది. మలం గట్టిగా వస్తుంటే ఇంకా ఎక్కువ నీరు తాగాలి. దీంతో మలం మెత్తబడి సాఫీగా విరోచనం అవుతుంది. అయితే కిడ్నీ జబ్బులు వంటివి గలవారు డాక్టర్ సలహా మేరకు ద్రవాలు తీసుకోవాలి. పీచు మలం ఏర్పడేలా చేసి, విసర్జన సాఫీగా అయ్యేలా చేస్తుంది?. కాబట్టి పండ్లు, కూరగాయలు, పొట్టు తీయని ధాన్యాలు, పప్పులు వంటి పీచుతో కూడిన ఆహారం ఎక్కువగా తినాలి. క్రమం తప్పకుండా వ్యాయామం, శారీరక శ్రమ చేయాలి. వీటితో జీర్ణకోశములోని కండరాలు ఉత్తేజితమవుతాయి. ఫలితంగా పెద్ద పేగు ద్వారా మలం తేలికగా ముందుకు కుదులుతుంది. రోజు కనీసం అరగంట సేపు నడవటం, సైకిల్ తొక్కటం చేయాలి. రోజు ఒకే సమయానికి విసర్జనకు వెళ్లేలా చూసుకోవాలి. విసర్జన వస్తున్నట్లు అనిపించగానే బాత్రూంకు వెళ్ళాలి. బలవంతంగా ఆపొద్దు. వృద్ధుల్లో చాలామంది ఒంటరితనంతో బాధపడుతుంటారు. ఇది మానసిక ఒత్తిడికి దారితీస్తుంది. మలబద్ధకం ఎక్కువవుతుంది. కాబట్టి ఒత్తిడి తగ్గించుకోవాలి. ఇందుకు ధ్యానము, యోగ ,ఆత్మీయులను కలవటం, సంగీతం వినడం, యాత్రలకు వెళ్ళటం వంటివిమేలు చేస్తాయి. జీవనశైలి మార్పులతో ఫలితం కనిపించకపోతే డాక్టర్ సలహా మేరకు మందులు వాడుకోవాలని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లిల్లీ మేరి పేర్కొన్నారు.

# మహిళా సిబ్బందికి ప్రాధాన్యమిస్తూ ఆర్పీఎఫ్ జోనల్ శిక్షణ కేంద్రాలను మెరుగుపరిచేందుకు రూ.35 కోట్ల నిధుల విడుదల

న్యూఢిల్లీ, అక్టోబర్ 5 : రైల్వే రక్షణ దళం (ఆర్పీఎఫ్) 40వ వ్యవస్థాపనా దినోత్సవ కవాతులో కేంద్ర రైల్వేలు, సమాచార ప్రసారాలు, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖల మంత్రి శ్రీ అశ్వనీ వైష్ణవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నాసిక్‌లోని ఆర్పీఎఫ్ శిక్షణ కేంద్రంలో ఈ కవాతు జరిగింది. ఈ కార్యక్రమంలో 2023-24 సంవత్సరానికి గాను అత్యుత్తమ సేవలు అందించి ధైర్యసాహసాలతో ప్రయాణికుల ప్రాణాలను కాపాడి జీవన్ రక్షా మెడల్ అందుకున్న 33 మంది ఆర్పీఎఫ్ సిబ్బందిని కేంద్రమంత్రి సత్కరించారు. జాతీయ రైల్వే వ్యవస్థకు భద్రత కల్పించడంలో వారు చేసిన సేవలను ఈ పురస్కారాలు ప్రతిబింబిస్తాయి. అలాగే ఆర్పీఎఫ్ సహోద్యోగుల్లో స్ఫూర్తిని నింపి బాధ్యతలకు అంకితమయ్యేందుకు తోడ్పడతాయి.

భద్రతా ప్రమాణాలను పాటించేందుకు ఆధునిక టెక్నాలజీని విరివిగా ఉపయోగిస్తున్న రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్పీఎఫ్)ను మంత్రి మెచ్చుకున్నారు. ఆర్పీఎఫ్ సిబ్బందికి రక్షణ కల్పించే బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు, మెరుగైన హెల్మెట్లు సహా అధునాతన భద్రతా పరికరాలు అందించనున్నట్టు ఆయన తెలిపారు. ఆర్పీఎఫ్ శిక్షణ కేంద్రాలను ఆధునికీకరించేందుకు రూ.35 కోట్ల నిధులు విడుదల చేస్తున్నట్టు మంత్రి ప్రకటించారు. వీటితో మహిళా సిబ్బందికి తగిన సౌకర్యాలు కల్పించేందుకు ప్రాధాన్యమిస్తారు. దీనికి అదనంగా తమిళనాడులోని ఆర్పీఎఫ్ డాగ్ స్క్వాడ్ జోనల్ శిక్షణ కేంద్రానికి మరో రూ.5.5 కోట్లు కేటాయించారు. ప్రత్యేక శిక్షణ వసతులను మెరుగుపరిచేందుకు ఈ నిధులు వినియోగిస్తారు.

క్రమశిక్షణ, నిబద్ధతను తెలియజేస్తూ సాగిన ఆర్పీఎఫ్ పరేడ్‌లో కేంద్రమంత్రి గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 'సాంగ్యాన్' మొబైల్ అప్లికేషన్ హిందీ ఎడిషన్‌ను ప్రారంభించారు. ఇది ఆర్పీఎఫ్‌లో అంతర్గతంగా సాగే సమాచార ప్రసారాన్ని మెరుగుపరుస్తుంది. కొత్తగా అమల్లోకి వచ్చిన మూడు నేరచట్టాలపై ఆర్పీఎఫ్ సిబ్బందికి అవగాహన కల్పించేందుకు హిందీలో రాసిన ప్రామాణిక పుస్తకాలను విడుదల చేశారు.

భారత రైల్వేల్లో రూపుదిద్దుకుంటున్న కొత్త మార్పులకు మార్గదర్శకత్వం వహిస్తూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీకి.. శ్రీ వైష్ణవ్ కృతజ్ఞతలు తెలిపారు. గతేడాది 5300 కి.మీ, గత పదేళ్లలో 31,000 కి.మీ మేర కొత్త రైల్వే లైన్లను నిర్మించినట్లు మంత్రి వెల్లడించారు. అలాగే పదేళ్లలో 40,000 కి.మీ మేర రైల్వే లైన్లను విద్యుదీకరించామని, గడచిన 60 ఏళ్లతో పోలిస్తే ఇది రెట్టింపు అని తెలిపారు.

వందేభారత్, అమృత్ భారత్ తరహా కొత్త తరం రైళ్ల ద్వారా ప్రయాణికులకు సౌకర్యవంతమైన, వేగవంతమైన ప్రయాణాన్ని సరసమైన ధరల్లో అందించడమే భారతీయ రైల్వేల లక్ష్యమని మంత్రి వివరించారు. కవచ్ లాంటి అత్యాధునిక సౌకర్యాలతో సురక్షితమైన ప్రయాణాన్ని ప్రజలకు అందిస్తామన్నారు. ప్రజల సౌకర్యార్థం 12,500 జనరల్ కోచ్ లను తయారుచేస్తున్నట్లు తెలిపారు.

ఆర్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ శ్రీ మనోజ్ యాదవ, సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్, భూస్వాల్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ శ్రీ ధరమ్ వీర్ మీనా, ప్రధాన కార్యాలయం, సెంట్రల్ రైల్వేకి చెందిన ఉన్నతాధికారులు ఈ 40వ వ్యవస్థాపనా దినోత్సవ కవాతులో పాల్గొన్నారు.

ఆర్పీఎఫ్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు ఈ వ్యవస్థాపన దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ప్రజా శ్రేయస్సు పట్ల తమ నిబద్ధతను తెలియజేస్తూ, వారి ఆనందాన్ని పరస్పరం పంచుకునే రోజు ఇది. రైల్వే ఆస్తుల పరిరక్షణ మాత్రమే కాకుండా ప్రయాణికులు, రైళ్ల భద్రతా బాధ్యతలు కూడా ఆర్పీఎఫ్‌కు అప్పగించారు. రైల్వే సాయం కోరిన మహిళలు, పిల్లలు, రోగులు, వృద్ధులు, దివ్యాంగులతో సహా అవసరమైన వారికి భద్రత కల్పిస్తుంది. రైల్వే ప్రయాణికులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణ అనుభూతిని అందిచేందుకు ఈ రక్షణ దళం రోజంతా పని విధులు నిర్వర్తిస్తుంది. రవాణా భద్రత కల్పించడం, ఉగ్రవాద నిరోధక చర్యలు చేపట్టడం, మానవ అక్రమ రవాణా, స్మగ్లింగ్‌తో సహా ఇతర నేరాలపై పోరాడటం, నేరాలను గుర్తించడంలో పోలీసులు, ఇతర చట్టపరమైన సంస్థలకు తోడ్పడటం, శాంతి భద్రతల నిర్వహణ చర్యల్లో భాగం పంచుకోవడం, జాతీయ, రాష్ట్ర ఎన్నికల సమయాల్లో పటిష్ఠ భద్రత కల్పించడం తదితరమైన కార్యకలాపాల ద్వారా జాతీయ భద్రతా వ్యవస్థలో కీలక భాగస్వామిగా ఆర్పీఎఫ్ మారింది.

నిబద్ధత, నిజాయతీతో పనిచేస్తూ దేశానికి, దేశ ప్రజలకు సేవ చేసేందుకు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ తనని తాను అంకితం చేసుకుంది. 'సేవా హీ సంకల్ప్' విధానాన్ని అవలంబించేందుకు "యశో లభస్వ (కీర్తిని పొందడం) అనే లోకోక్తి సాధన దిశగా ఆర్పీఎఫ్ అన్ని అవకాశాలను వినియోగించుకుంటోంది.

# ప్రకృతిని పూజించే గొప్ప పండుగ బతుకమ్మ : ఎమ్మెల్యే తలసాని



హైదరాబాద్, అక్టోబర్ 5 : ప్రకృతిని పూజించే గొప్ప పండుగ బతుకమ్మ అని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం నెక్లెస్ రోడ్‌లోని బుద్ధ భవన్ వద్ద గల కర్బలా మైదానంలో ఈ నెల 10వ తేదీన నిర్వహించే బతుకమ్మ పండుగ ఏర్పాట్లను వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యవేక్షించారు. వేలాది మంది మహిళలు పాల్గొననున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా బతుకమ్మ పూర్తయ్యే వరకు వాహనదారులు, ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా ట్రాఫిక్ మళ్ళించేలా చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీసులను ఆదేశించారు.బతుకమ్మ ఆడే ప్రాంతం మొత్తం లైట్లను ఏర్పాటు చేయాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. అదేవిధంగా బతుకమ్మలను నిమజ్జనం చేసే హుస్సేన్ సాగర్‌లోని బతుకమ్మ ఘాట్‌లో కూడా లైట్లను ఏర్పాటు చేయాలన్నారు. బతుకమ్మ పాటలతో కూడిన సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలన్నారు. వచ్చిన ప్రజల సౌకర్యార్థం త్రాగునీటి కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని వాటర్ వర్క్స్ అధికారులను ఆదేశించారు. బతుకమ్మ ఆడే ప్రాంతం, బతుకమ్మ ఘాట్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే పండుగ బతుకమ్మ అని తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి 9 రోజులపాటు మహిళలు ఎంతో ఘనంగా జరుపుకుంటారని వివరించారు. ప్రతి సంవత్సరం కర్బలా మైదానంలో నిర్వహించే బతుకమ్మకు వచ్చే మహిళలు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా అన్ని ఏర్పాట్లను చేస్తూ వస్తున్నామని, ఈ సంవత్సరం కూడా అన్ని ఏర్పాట్లను చేయడం జరుగుతుందని వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్ర పండుగగా జరుపుకుంటున్న విషయాన్ని గుర్తు చేశారు. ఒక్క తెలంగాణ ప్రాంతానికే పరిమితమైన బతుకమ్మ పండుగ దేశ విదేశాలలో నిర్వహిస్తున్నారని, ఇది మనకెంతో గర్వకారణమని తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు.

# 6 నుంచి మెట్రో స్టేషన్లలో పార్కింగ్ ఫీజు

హైదరాబాద్, అక్టోబర్ 5 : మెట్రో రైలు ప్రయాణికుల డిమాండ్లను పరిష్కరించకుండా పార్కింగ్ ఫీజులు పెంచుతామంటున్న ఎల్ అండ్ టీ మెట్రో అధికారులపై ప్రయాణికులు భగ్గుమంటున్నారు. గత నెలలోనే నాగోల్,మియాపూర్ మెట్రో స్టేషన్లలో కొత్తగా పార్కింగ్ ఫీజులు పెంచుతామని బోర్డులు ఏర్పాటు చేస్తే పెద్ద ఎత్తున ఆందోళన చేయడంతో అధికారులు వెనక్కి తగ్గారు.

మళ్లీ తాజాగా మెట్రో ప్రయాణికులకు 3 ఆఫర్లు అంటూ ప్రకటిస్తూనే? నామమాత్రపు పార్కింగ్ ఫీజును అక్టోబర్ 6 నుంచి వసూలు చేయాలని నిర్ణయించడం పట్ల ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం 3 బోగీలతో నడుస్తున్న మెట్రో రైళ్లకు అదనంగా కోచ్‌లను ఏర్పాటు చేయాలని నెలల తరబడిగా డిమాండు చేస్తున్నా.. ఆవిషయాన్ని పట్టించుకోకుండా పార్కింగ్ ఫీజులు పెంచుతారా.? అంటూ సోషల్ మీడియా వేదికగా మండిపడుతున్నారు.

భగ్గుమంటున్న మెట్రో ప్రయాణికులు



# గార్బేజ్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దాలి: ఆమ్రపాలి

## -బల్దియా కమిషనర్ ఆమ్రపాలి

హైదరాబాద్, అక్టోబర్ 5 : నగరాన్ని గార్బేజ్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికలు తయారు చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. శుక్రవారం అడిషనల్, జోనల్ కమిషనర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు.

గ్రేటర్‌లో శానిటేషన్ ప్రక్రియను మెరుగుపరిచి గార్బేజ్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని శానిటేషన్ అడిషనల్ కమిషనర్‌ను ఆదేశించారు. గతంలో శానిటేషన్ మెరుగుకు తీసుకున్న చర్యలు, ప్రస్తుతం తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించాలన్నారు. అవసరమైతే జోనల్ కమిషనర్లు, ఎస్ఎస్‌డబ్ల్యూ ఇంజినీర్లతో చర్చించి తుది నివేదికను రెండు రోజుల్లో అందజేయాలని శానిటేషన్ ఏసీకి సూచించారు.

# హర్యానాలో ముగిసిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్.. ఈ నెల 8న కౌంటింగ్

జహర్యానాలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. ఆద్యంతం ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ప్రశాంతంగా పోలింగ్ జరిగింది. సాయంత్రం 5 గంటల వరకు 61 శాతం పోలింగ్ నమోదైందని భారత ఎన్నికల సంఘం తెలిపింది.

హర్యానాలోని మొత్తం 90 అసెంబ్లీ స్థానాలకు ఇవాళ ఒకే విడతలో పోలింగ్ నిర్వహించారు. అంతకుముందే జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ కూడా ముగిసింది. రెండు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను ఒకేసారి అక్టోబర్ 8న విడుదల చేయనున్నారు. కచ్చితమైన పోలింగ్ శాతం తెలుసుకునేందుకు మరికొంత సమయం పడుతుందని ఈసీ తెలిపింది.

# రాష్ట్రంలోని మనషులనే కాదు.. చివరకు దేవుళ్లను కూడా మోసం చేసిండు


## -సీఎం రేవంత్ రెడ్డి పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం

రంగారెడ్డి అక్టోబర్ 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : రాష్ట్రంలోని మనషులనే కాదు.. చివరకు దేవుళ్లను కూడా సీఎం రేవంత్ రెడ్డి మోసం చేసిండని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలోని ప్రతి వర్గాన్ని రేవంత్ మోసం చేశారని కేటీఆర్ ధ్వజమెత్తారు. మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని కందుకూరులో ఏర్పాటు చేసిన రైతు ధర్నాలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు.రూ. 2 లక్షల వరకు రుణాలు తెచ్చుకోండి.. డిసెంబర్ 9న మొదటి సంతకం చేసి రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తానని రేవంత్ రెడ్డి చెప్పిండు. కానీ ఇప్పటి వరకు రుణమాఫీ పూర్తి కాలేదు. రేవంత్ పరిపాలన పది నెలలు నిండేందుకు వచ్చింది.. కానీ రుణమాఫీ పూర్తిగా మాఫీ కాలేదు. సెక్రటేరియట్‌లో ప్రభుత్వ పరిపాలన యంత్రాంగం ఉంటుంది. కానీ సీఎం మాత్రం లంకె బిందెలు ఉంటాయని సెక్రటేరియట్ వెళ్లిండట. ఇలాంటోడు మన ముఖ్యమంత్రి. చివరకు కనిపించిన దేవుడి మీద ఒట్టు పెట్టి.. పంద్రాగస్టు వరకు రుణమాఫీ చేస్తా అన్నాడు. ఏ దేవుడిని విడిచి పెట్టలేదు. మనషులనే కాదు చివరకు దేవుళ్లను కూడా మోసం చేసిండు చిట్టి నాయుడు అని కేటీఆర్ మండిపడ్డారు.కందుకూరులో మనం చేసే లొల్లి దేశానికి తెలియొద్దని రేవంత్ కుట్ర చేస్తున్నాడు. సీఎం కుర్చీని కాపాడుకునేందుకు ప్రయత్నిస్తుండు. దొడ్డు వడ్లకు బోనస్ ఇస్తా అన్నాడు. ఇవాళ సన్న వడ్లకు ఇస్తా అంటుండు. రుణమాఫీ, బోనస్, రైతు బంధు పేరుతో మోసం చేసిండు. అటుకాకుండా ఇటుకాకుండా రైతుల పరిస్థితి తయారైంది. రాష్ట్రంలోని ప్రతి వర్గాన్ని రేవంత్ మోసం చేసిండు. ఇంట్లో ఇద్దరికి పెన్షన్ ఇస్తా అన్నాడు. కోడళ్లకు కూడా ఇస్తా అన్నాడు. బతుకమ్మ చీరలు లేనే లేవు. దసరా పండుగ పండుగలా లేదు. ఒకటి కాదు రెండు కాదు.. ఆరు గ్యారెంటీలు నూరు రోజులు.. ఆరునెలైనా అమలు చేస్తా అన్నాడు. ఇందిరమ్మ ఇండ్లు ఇస్తా

# ధనలక్ష్మిగా కర్నూలు వాసవీ మాత దర్శనం.. రూ. కోట్లతో అలంకరణ

కర్నూలు , అక్టోబర్ 5 : కర్నూలు నగరంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం (చిన్నమ్మ వారి శాల, పూల బజార్) నందు.. శనివారం వాసవీ మాతకు రూ.3 కోట్ల (?500, 200, 100, 50, 10) కొత్త నోట్లతో ధనలక్ష్మి అలంకారంలో శ్రీ వాసవి మాతను అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారి శాలకు విచ్చేసిన భక్తులు ధనలక్ష్మి అమ్మవారి కృపకు పాత్రులయ్యారు.

వేడపైన జ్ఞానేశ్వరమ్మ ఆధ్వర్యంలో అరుణాచల గిరి ప్రదక్షిణ, గుండ శ్రీదేవి బృందంచే కోలట నృత్య ప్రదర్శన, చిన్న పిల్లలచేత భక్త ప్రహ్లాద నాటకం చాలా కన్నుల పండుగగా జరిగినట్లు చిన్న అమ్మవారి శాల ఆలయ కమిటీ కార్యవర్గం సభ్యులు ఇల్లూరు రవీంద్రుడు వెల్లడించారు.



# రోడ్డు మలుపుల వద్ద ప్రమాదాలను పసిగట్టే మిశ్రమ నానో పాలిమర్

## ఈ కొత్త పదార్థానికి రక్షణతోపాటు విద్యుదుత్పత్తి లక్షణాలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 5 : మలుపులు ఎక్కువగా ఉన్న రహదారుల్లో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయి. అయితే ఈ ప్రమాదాలను పసిగట్టేందుకు శాస్త్రవేత్తలు ఒక సెన్సార్ ను రూపొందించారు. నానోస్థాయి- మిశ్రమ విధానంలో- ఈ పాలిమర్ ను రూపొందించారు. ఇది ఒత్తిడిని గుర్తించడంతోపాటు, స్వయంగా విద్యుత్తును ఉత్పత్తి చేసుకోగలదు.

కావాల్సిన విద్యుత్తును స్వయంగా తయారు చేసుకోగలిగిన, ఒత్తిడిని గుర్తించగలిగిన (ప్రెజర్ సెన్సింగ్) కొత్త తరహా పదార్థాలను రూపొందించే పనిలో శాస్త్రవేత్తలు తమునకలై ఉన్నారు. దీనివల్ల సులభంగా వంగే గుణం, ఎక్కడికైనా తీసుకువెళ్లగలగడం, దీర్ఘకాల మన్నిక, సులువుగా ధరించడాని వీలు ఉండటం, వాటికవే అవసరమైన విద్యుత్తును తయారు చేసుకునే పరికరాలను తయారు చేయడం సుసాధ్యం అవుతుంది. నేటి కృత్రిమ మేధ యుగంలో ఇలాంటి పరికరాల అవసరం ఎంతో ఉంది. నేటి సరళమైన ఎలక్ట్రానిక్ పరికరాల్లో- పాలీమర్లు, నానో కణాల పాత్ర ఎంతో ఉన్నది.

బెంగుళూరు లోని నానో అండ్ సాఫ్ట్ మ్యాటర్ సైన్సెస్ కేంద్రం ( సీఈఎన్ఎస్) పరిశోధకులు, ఒత్తిడిలో మార్పులను నమోదు చేసి, తన ఇంధన అవసరాలను తానే తీర్చుకోగల సామర్థ్యం కలిగిన పాలిమర్ నానో కాంపొజిట్ పదార్థాన్ని తయారు చేశారు. ఈ పదార్థాన్ని రహదారి భద్రతకు ఉపయోగకరంగా ఉండే సెన్సర్ నమూనా తయారీలో వినియోగించారు.

ఈ పరికరం పైభాగం కదిలే స్వభావాన్ని కలిగి ఉంటుంది. దీనిని ప్రమాదకర మలుపులకు 100 మీటర్ల ముందు రోడ్డుపై అమర్చాల్సి ఉంటుంది. వ్యతిరేక దిశ నుంచి వచ్చే వాహనం తెరపై వస్తున్న సిగ్నల్ ను గమనించి అప్రమత్తం అవగలదు. 'పీజో-ఎలెక్ట్రిక్ ఎఫెక్ట్' గా పేర్కొనే, ఒత్తిడి వల్ల కలిగే విద్యుచ్ఛక్తితో పనిచేసే ఈ నమూనా, ఆ శక్తిని తదుపరి వినియోగానికై భద్రపరుచుకోగలదు. అదనపు శక్తిని అనేక ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలకు అందించవచ్చు.

'డైకాల్కోజినైడ్' అనే పదార్థంతో ఈ నూతన పాలిమర్ నానో కాంపొజిట్ నమూనా తయారైంది.

వెనేడియండై సల్ఫైడ్ (వీఎస్2) ఉపరితలానికి అత్యధిక స్థాయిలో విద్యుత్ పంపిణీ చేయడం ద్వారా పాలీమర్ల పీజో-ఎలెక్ట్రిక్ లక్షణాన్ని పెంచే సామర్థ్యాన్ని శాస్త్రవేత్తలు అంకుర్ వర్మ, డాక్టర్ అర్జున్ హరి మధు, డాక్టర్ సుభాష్ చెరుమన్నిల్ కరుముత్తిల్ సాధించారు. పాలీవినైలిడీన్ డైఫ్లోరైడ్ లేదా 'పీవీడీఎఫ్' గా ప్రసిద్ధమైన పీజో-ఎలెక్ట్రిక్ లక్షణం కలిగిన పాలీమర్లో వివిధ గాఢతలలో గల నానో కణాలని ప్రవేశ పెట్టడం ద్వారా పాలిమర్ నానో కాంపొజిట్ ఫిల్ములను ఈ బృందం తయారు చేసింది.

పాలిమర్ నానో కాంపొజిట్ పీజో-ఎలెక్ట్రిక్ లక్షణాలని నానోపార్టికల్స్ ఉపరితలానికి అందించే విద్యుత్ ఏ విధంగా ప్రభావితం చేస్తుందో శాస్త్రవేత్తలు అధ్యయనం చేశారు. నమూనాను ఒత్తిడిని గుర్తించే సాధనంగా వినియోగించి, రహదారి భద్రతా సెన్సర్ ను పరీక్షించేందుకు దీనిని ఒక గుమ్మం వద్ద ఉంచి పరీక్షించి చూశారు.

'పీవీడీఎఫ్'- 'వీఎస్2' రకం నానో కాంపొజిట్ పదార్థాలు, సులభంగా వంగే లక్షణం, ఎక్కడికైనా తీసుకువెళ్లగలిగే డిజైన్, దీర్ఘకాలిక ఇంధన ఉత్పాదక సామర్థ్యం కలిగి, ఒత్తిడిలో మార్పులను పసిగట్టగల వస్తువుల తయారీలో కీలకం కాగలవని ఈ అధ్యయనం నిరూపించింది. ఇటీవల ఈ అధ్యయనాన్ని 'జర్నల్ ఆఫ్ మెటీరియల్ కెమిస్ట్రీ ఏ' అనే విజ్ఞాన శాస్త్ర పత్రికలో ప్రచురించడమే కాక, పేటెంట్ పత్రాన్ని కూడా దాఖలు చేశారు.'ఇన్స్పైర్' పేరిట గల ఉన్నతస్థాయి సాంకేతిక కార్యక్రమానికి కేంద్ర శాస్త్ర సాంకేతిక విభాగం అందించే నిధులతో మొదలైన 'స్వయం సమృద్ధ ఇంధన సామర్థ్య పదార్థాలు, ఒత్తిడిని గుర్తించే సాధనాలు' అనే కార్యక్రమంలో భాగంగా ఈ అధ్యయనం జరిగింది.

# ముగ్గురి ఉసురు తీసిన ఆన్ లైన్ బెట్టింగ్..

## -ఆన్లైన్ బెట్టింగ్లకు బానిసైన కొడుకు
## -అప్పుల పాలైన కుటుంబం
## -కొడుకుతో సహా తల్లిదండ్రుల ఆత్మహత్య

నిజామాబాద్, అక్టోబర్ 5 : అన్యోన్యంగా సాగుతున్నా ఓ కుటుంబం కుమారుడు ఆన్లైన్ బెట్టింగు అప్పులు ఎక్కువై సుమారు 18 లక్షల అప్పులతో మోయలేని భారంతో నలుగురిలో తిరగలేక శుక్రవారం



రాత్రి ముగ్గురు కుటుంబ సభ్యులు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎడపల్లి మండలం వడ్డపల్లి గ్రామంలో చోటుచేసుకున్నది పోలీసులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వడ్డేపల్లి గ్రామానికి చెందిన రంగనేని. సురేష్ భార్య హేమలత కుమారుడు హరీష్ అన్యోన్యంగా సాగుతున్న కుటుంబం గత 20 సంవత్సరాల నుండి వ్యవసాయంతో పాటు కిరాణా షాప్ నడుపుతూ జీవనం సాగిస్తున్నారు ఈ క్రమంలో కుమారుడా హరీష్ ఆన్లైన్ బెట్టింగ్లతో పాటు అప్పులు చేయడంతో ఎక్కువ మోతాదుల అప్పులు కావడంతో తల్లిదండ్రులు గతంలో 0.20 గుంటల భూమిని అమ్మి గతంలో అప్పులను చెల్లించారు అయినా కుమారుడు తీరుమారక అప్పులు ఆన్లైన్ బెట్టింగ్లతో సుమారు 18 లక్షలు అప్పులు కావడంతో అప్పుల వారు ఆన్లైన్ వారి ఒత్తిడి కావడంతో నలుగురిలో తిరగలేక మనస్తాపం చెంది శుక్రవారం అర్ధరాత్రి ముగ్గురు వారి ఇంట్లో చీరల సహాయంతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు


శనివారం ఉదయం పక్కన ఉన్న పొరుగువారు లేవకపోవడంతో డోర్ ను కొట్టిన తియక కపోవడంతో ఇంటి వెనకల ఉన్న కిటికీ గుండా చూడడంతో ముగ్గురు ఉరివేసుకొని ఉండటం గమనించి ఎడపల్లి పోలీసులకు సమాచారం అందించగా ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణ రెడ్డి ఘటన స్థలం చేరుకొని ఘటన స్థలాన్ని పరిశీలించి పంచనమ నిర్వహించి మృతదేహాలకు పోస్టు మార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు కుటుంబంలో ముగ్గరికి ముగ్గురు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకోవడం పట్ల వడ్డపల్లి గ్రామంలో తీవ్ర విషాదాలు అలుముకున్నాయి.

# బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు




రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 5 : (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలో కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. జూనియర్ సివిల్ జడ్జ్ కం జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ ×జడ్జి జ్యోతిర్మయి×, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ×గుడిసె సదానందం ఏజీపీ ×పొత్తూరి అనిల్×, సీనియర్ న్యాయవాదులు కిషోర్ రావు, బొడ్డు ప్రశాంత్ ,నాగుల సంపత్ ,నేదూరి అభిలాష్, అనిల్ జూనియర్ సివిల్ కోర్ట్ ×సూపర్డెంట్ అంజయ్య , కోర్టు సిబ్బంది పాల్గొన్నారు

# బిజెపి కరీంనగర్ జిల్లా ధార్మిక సెల్ నూతన కమిటీ నియామకం-కన్వీనర్‌గా నిరంజన్ రావు...



కరీంనగర్, అక్టోబర్ 5 : (నేటినిజం ప్రతినిధి) భారతీయ జనతా పార్టీ కరీంనగర్ జిల్లా ధార్మిక సెల్ నూతన కమిటీ ఏర్పాటయింది. కన్వీనర్ గా బొందుగులపటి నిరంజన్ రావు, జెయింట్ కన్వీనర్ లుగా ఏరబాటి శశికాంత్, జనుమంచి విజయ్ కుమార్ శర్మ లు నియమితులయ్యారు. ఈ మేరకు బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి నియామకపు ప్రకటన విడుదల చేశారు. బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంటు సభ్యులు, కేంద్ర హోమ్ శాఖ మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ చేతుల మీదుగా వారు నియామకపు ఉత్తర్వులను అందుకున్నారు. బిజెపి ధార్మిక సెల్ కు నూతనంగా నియమితులైన బాధ్యులు మాట్లాడుతూ బిజెపి ధార్మిక సెల్ ను జిల్లావ్యాప్తంగా బలోపేతం చేయడానికి తగిన కృషి చేస్తామన్నారు. ధార్మిక, ధర్మ రక్షణ కోసం ఏర్పాటైన ఇట్టి సెల్ ఆధ్వర్యంలో తగిన క కార్యక్రమాలు చేపట్టి ముందు కొనసాగుతామని వారు ఈ సందర్భంగా తెలిపారు. బిజెపి ధార్మిక సెల్ బాధ్యులుగా తమ నియామకానికి సహకరించిన బిజెపి శ్రేణులు అందరికీ , ముఖ్యంగా కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి లకు వారు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి ,ఉపాధ్యక్షులు కళ్లెం వాసుదేవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబరాలు



కరీంనగర్, అక్టోబర్ 5 : (నేటినిజం ప్రతినిధి) వేములవాడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నాడు కళాశాల ఎన్.ఎస్.ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులతో కలిసి బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ సి.హెచ్ శరత్ కుమార్ మాట్లాడుతూ పూలను పూజిస్తూ, మహిళలు పాడే బతుకమ్మ పాటల్లో మహిళలు తమ కష్ట సుఖాలు, ప్రేమ, స్నేహం, బంధుత్వం, ఆప్యాయతలు, భక్తి లాంటివి స్పష్టంగా కనబడతాయని అలాగే తెలంగాణ సంస్కృతిని తెలిపే ఈ పండుగను తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత బతుకమ్మను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం అధికారి వి. అంజయ్య , అధ్యాపకులు శేఖర్,మహేందర్,జయ భరత్ రెడ్డి, గోపి, మహేందర్ రెడ్డి,సంతోష్, రవీందర్, దేవయ్య, అశోక్, శ్రీనివాసరావు, మంగమ్మ, లత, అరుణ, స్వప్న, జ్యోతి, మరియు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# రూ.7.5 కోట్ల తో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలక ఎంపి ఈటెల శంకుస్థాపన



మేడ్చల్ – మాల్కాజ్గిరి అక్టోబర్ 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ చైర్మన్, వైస్ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి గారుతో కలిసి ఏడున్నర కోట్ల రూపాయలతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలాక్జిగిరి పార్లమెంట్ అనేది దేశంలోనే అతిపెద్ద పార్లమెంటే కాకుండా కొత్తగా అభివృద్ధి చెందుతున్న నగరం. ఇక్కడ డ్రైనేజ్, డ్రింకింగ్ వాటర్, రోడ్లు సమస్యలు ఎంత చేసినా తరగనటువంటి నియోజకవర్గం ఇది. రాష్ట్ర ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవని చెప్తున్నారు. కేంద్ర ప్రభుత్వం, ఆూఖీ పరంగా ప్రజల మౌలిక వసతుల కల్పనలో మేమంతా కలిసికట్టుగా పనిచేసి మల్కాజ్గిరి పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రజల సమస్యలు తీర్చడంలో ముందు భాగంలో ఉంటామని తెలియజేస్తున్నాను

# బండారు సునీతకు ఉమ్మడి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పురస్కారం

హైదరాబాద్, అక్టోబర్ 5 : ప్రముఖ కవయిత్రి, హిందీ పాఠశాల సహాయకురాలు బండారు సునీత ఉమ్మడి పాలమూరు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. శనివారం నాడు జిల్లా కేంద్రంలోని రాజీవ్ విద్యా మిషన్ సమావేశ మందిరంలో జరిగిన అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం మరియు అహల్య భాయ్ హోల్కర్ త్రి శతాబ్ది జయంతి ఉత్సవాల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర 'సామాజిక సమరసత వేదిక' వారు నిర్వహించిన కార్యక్రమంలో అమరచింత ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయిని బండారు సునీతను శాలువా ,మెమెంటో, ప్రశంసా పత్రంతో ఘనంగా సన్మానించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతిలో ఉందని ఆ విద్యార్థులను తీర్చిదిద్దడంలో ముఖ్యమైన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని అన్నారు. ఉపాధ్యాయురాలుగానే కాకుండా కవయిత్రిగా, రచయిత్రిగా, సామాజిక సేవకురాలిగా వివిధ రంగాలలో సేవలందిస్తున్న బండారు సునీత సమాజానికి మార్గదర్శకురాలని, ఇటీవల ప్రభుత్వం చే కూడా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు సునీత అందుకుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయురాలుగా ఉత్తమంగా బాధ్యతలు నిర్వహిస్తూనే నిత్య విద్యార్థిగా సైకాలజీ తో పాటు మూడు భాషలలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ మరియు మూడు సబ్జెక్టులలో బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ పూర్తి చేసి పి.హెచ్.డి కూడా పూర్తిచేయాలనే సంకల్పించడం నేటి విద్యార్థులకు ఆదర్శమని కొనియాడారు. ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు అందుకున్న బండారు సునీత మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు పొందడానికి అప్లై చేసుకునే విధానానికి స్వస్తిపలకాలని, వాస్తవంగా పనిచేస్తున్న కొంతమంది ఉపాధ్యాయులు అవార్డు కొరకు అప్లై చేసుకోరని అలాంటి వారిని గుర్తించి నేరుగా సంబంధిత అధికారుల చేత ప్రభుత్వం అవార్డులు అందజేయాలని కోరారు. అవార్డు రావడం వల్ల తమపై మరింత బాధ్యత పెరిగిందని , విద్యార్థుల పురోగతిలో ఇంటివద్ద తల్లిదండ్రుల పాత్ర కూడా కీలకమని బండారు సునీత అన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర విద్యా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రాజేంద్ర సింగ్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడడంతో పాటు తెలంగాణలో సేవలు అందజేస్తున్న వారిని గుర్తించి సన్మానించడం మంచి సంప్రదాయమనీ, నిర్వాహకులు డాక్టర్ శ్రీనివాస్ అభినందనీయులన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక సమరసత వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గన్నోజు శ్రీనివాస్, ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేశ్వర శర్మ, జిల్లా పిఆర్టియు సంఘ నాయకులు మదన్మోహన్ యాదవ్, సుధాకర్ రెడ్డి, రాజశేఖర్ గౌడ్, మండల విద్యాధికారులు కృష్ణయ్య, వెంకటాజి, రాజు నాయక్ మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# తెలంగాణలో మూడురోజులు వర్షాలు.. హైదరాబాద్ సహా 15 జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ

హైదరాబాద్, అక్టోబర్ 5 : తెలంగాణలో రాగల మూడురోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. శనివారం సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందని తెలిపింది.

ఆదివారం యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వానలు పడే ఛాన్స్ ఉందని చెప్పింది. సోమవారం ఖమ్మం, నల్గొండ, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని చెప్పింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

# వరద బాధితులకు అండగా నిలిచిన వారికి కృతజ్ఞతలు : మంత్రి నారాయణ




అమరావతి, అక్టోబర్ 5 : విజయవాడలోని వరద బాధితులకి అండగా నిలిచిన ప్రతీ ఒక్కరికి పేరు పేరు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలో? ఆయన అధికారులతో సమీక్షించారు. వరదల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సిటీ అభివృద్ధి తదితర విషయాలపై అధికారులకి ఆయన దిశా నిర్దేశం చేశారు.

ముఖ్యంగా ఎప్పటి పని అప్పుడే అయిపోవాలని? పెండింగ్ ఉంటే ఊరుకోనని తనదైన శైలిలో వార్నింగ్ ఇచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలో పలువురు మంత్రికి వినతి పత్రాలు అందచేశారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలించి బాధితులకి న్యాయం చేయాలని స్పాట్‌లోనే అధికారుల్ని ఆదేశించారు. అనంతరం మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు.

బుడమేరు తెగిపోయి? సుమారు ఏడు లక్షల మంది 11 రోజులు నానా అవస్థలు పడిన విషయం తెలిసిందేనన్నారు. 11 రోజుకి 33 డివిజన్లకు గాను? 29 డివిజన్ల క్లియర్ చేయడం జరిగిందన్నారు. అలాగే మరో నాలుగు డివిజన్లు క్లియర్ కావడానికి 19 రోజులు టైం పట్టిందన్నారు.

ఆ 11 రోజులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడే స్వయంగా కలెక్టరేట్‌లో ఉండి? ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, సీనియర్ ఐఏఎస్ అధికారుల్ని, అధికారులందరిని ఫీల్డ్ కి పంపించి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారన్నారు. ఈ రోజు రాష్ట్రానికి దాదాపు రూ. 450 కోట్లకుపై ఫండ్స్ వచ్చాయని తెలిపారు. ఎందుకంటే ఆ పరిస్థితిని అందరూ కళ్లారా చూశారు కాబట్టే ముందుకు వచ్చారన్నారు.

ముఖ్యమంత్రి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు, అధికారులు కూడా స్వయంగా ఇళ్లలోకి తిరిగాం న్నారు. అదే విధంగా నెల్లూరు నుంచి చాలా మంది వరద బాధితుల కోసం కూరగాయలు, దుప్పట్లు, ఫండ్స్ ఇలా అనేక రకాలుగా అండగా నిలిచారన్నారు.

అలాగే మా నారాయణ ఆర్గనైజేషన్స్ నుంచి రూ. 2.5 కోట్లు మా పిల్లలు ఇవ్వడం జరిగిందన్నారు.

నెల్లూరులో రాఘవయ్య రూ. 1 లక్ష ఇచ్చారని, అందుకు ముఖ్యమంత్రి నుంచి వరద బాధితుల కోసం అండగా నిలిచినందుకు కృతజ్ఞతలు తెలియజేశారన్నారు.

వరద బాధితులకి అండగా నిలిచిన ప్రతీ ఒక్కరూ పేరు పేరున ధన్యవాదాలు తెలియజేస్తున్నానని చెప్పారు. దీని వల్ల ఎన్నో కుటుంబాలకు అండగా నిలిచిన వారు అయ్యారన్నారు.

# రేషన్ కార్డుల జారీలో అలసత్వం-సుప్రీం సీరియస్ !

హైదరాబాద్, అక్టోబర్ 5 : వలస కార్మికులకు రేషన్ కార్డులు జారీ చేసే అంశంలో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు వ్యవహరిస్తున్న తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తాము ఇచ్చిన ఉత్తర్వులను పాటించేందుకు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఇదే చివరి అవకాశం ఇస్తున్నామని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది.

లేని పక్షంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు కోర్టుకు హాజరు కావాల్సి ఉంటుందని సుప్రీంకోర్టు ధర్మాసనం తీవ్ర హెచ్చరికలు చేసింది. ఈ వ్యవహారంపై నవంబరు 19వ తేదీలోగా కేంద్ర ప్రభుత్వంతోపాటు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తగిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

# విజయవాడ దుర్గమ్మకు రూ. 18 లక్షల బంగారు మంగళసూత్రం బహూకరణ



అమరావతి, అక్టోబర్ 5 : దేవీ నవరాత్రుల సందర్భంగా విజయవాడ దుర్గమ్మకు భక్తులు భారీగా కానుకలను సమర్పించుకుంటున్నారు. 9 రోజుల పాటు అత్యంత వైభవంగా ఇంద్రకీలాద్రిపై జరిగే ఉత్సవాలను తిలకించడానికి తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుంటున్నారు.ప్రకాశం జిల్లా కొండేపి నివాసి కల్లగుంట అంకులయ్య అనే కొబ్బరిబోండాలు అమ్ముకునే భక్తుడు రూ. 18 లక్షల విలువైన బంగారు మంగళసూత్రాన్ని శనివారం అమ్మవారికి బహూకరించారు. గుంటూరుకు చెందిన మరో భక్తుడు చేబ్రోలు పుల్లయ్య 6.5 కేజీల వెండితో తయారు చేయించిన హంసవాహనాన్ని కానుకగా సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో రామారావు మాట్లాడుతూ భక్తుల కోరికలు తీర్చే దుర్గమ్మకు కానుకల రూపేణా అందజేసిన దాతలకు అభినందనలు తెలిపారు. దాతలపై అమ్మవారి కటాక్షం ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా శనివారం అమ్మవారు అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

# 15 రోజులుగా ఇంట్లో దొంగతనాలు.. హైకోర్టును ఆశ్రయించిన న్యాయవాది

ముంబై, అక్టోబర్ 5 : ఒక న్యాయవాది ఇంట్లో 15 రోజులుగా వరుసగా దొంగతనాలు జరుగుతున్నాయి. పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకపోయింది. దీంతో ఆ న్యాయవాది హైకోర్టును ఆశ్రయించారు. (బవతీతివబ నీట బిష్ట్రవటబిబ తిని ఒంటలనీఃఇ-జీబివ ఊనీఎవ) మహారాష్ట్ర రాజధాని ముంబైలో ఈ సంఘటన జరిగింది. న్యాయవాది ధృతిమాన్ జోషి కుటుంబం 1938 నుంచి దాదర్ ఈస్ట్ ప్రాంతంలోని సొంత ఇంటిలో నివసిస్తున్నది. ఆగస్టు 15 నుంచి ఆ ఇంటిలోని గ్యాస్ సిలిండర్లు, పాత్రలు, డోర్ లాచ్‌లతో సహా పలు వస్తువులను దొంగలు చోరీ చేసినట్లు న్యాయవాది జోషి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఇల్లు శిథిలావస్థకు చేరడంతో సమీపంలోని బిల్డింగ్‌లోకి మారినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆ ఇంట్లో వదిలేసిన వస్తువులు 15 రోజుల నుంచి వరుసగా చోరీ అవుతున్నాయని ఆరోపించారు.కాగా, పాత ఇంట్లో దొంగతనాల గురించి ఫిర్యాదు చేసిన తనను పోలీసులు ఎగతాళి చేశారని న్యాయవాది జోషి విమర్శించారు. పాడుబడి వదిలేసిన ఇళ్లలో ఇలాంటి సంఘటనలు సర్వసాధారణమని వారు చెప్పారని అన్నారు. కేసు నమోదు చేసినప్పటికీ పోలీసులు సరిగా దర్యాప్తు చేపట్టలేదని ఆరోపిస్తూ బాంబే హైకోర్టును ఆశ్రయించారు. పొరుగు ఇళ్లలో కూడా ఇలాంటి చోరీలు జరుగుతున్నాయని పిటిషన్‌లో పేర్కొన్నారు.

మరోవైపు న్యాయమూర్తులు రేవతి మోహితే-దేరే, పృథ్వీరాజ్ చవాన్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా పోలీస్ ఇన్‌స్పెక్టర్ కోర్టుకు హాజరయ్యారు. ఆ ప్రాంతంలో దొంగతనాలకు పాల్పడుతున్న నిందితులను గుర్తించేందుకు కృషి చేస్తున్నామని వివరించారు.

కాగా, ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించామని, కొందరు అనుమానాస్పద వ్యక్తులు కనిపించారని ముంబై పోలీసుల తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వీఎన్ సాగరే కోర్టుకు తెలిపారు. పోలీసులు మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని చెప్పారు. దీంతో దర్యాప్తు పురోగతిపై తాజా సమాచారాన్ని ఇవ్వాలని పోలీసులను కోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను అక్టోబర్ 25కు వాయిదా వేసింది.

# శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో వైభవంగా స్నపన తిరుమంజనం



తిరుపతి, అక్టోబర్ 5 : శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం మధ్యాహ్నం స్నపన తిరుమంజనం శాస్త్రోక్తంగా జరిగింది. ఈ సందర్భంగా మలయప్పస్వామివారిని శ్రీవల్లి పుత్తూరు నుంచి మొదటిసారిగా తెచ్చిన చిలకలతో చేసిన మాలలు, కిరీటాలతో అలంకరించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా మలయప్ప స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేక వేదికపై సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. రంగురంగుల ఆర్కిడ్ పుష్పాలలతో వేదికను సుందరంగా తీర్చిదిద్దారు.

ముందుగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, ముఖ ప్రక్షాళన, ధూపదీప నైవేద్యం, ఛత్ర ఛామర వ్యజన దర్పణాది నైవేద్యం, రాజోపచారం నిర్వహించారు.

అర్ఘ్యపాద నివేదనలో భాగంగా పాలు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, గంధంతో స్నపనం నిర్వహించారు.

వీటిని శంఖనిధి, పద్మనిధి, సహస్రధార, కుంభధారణలతో వైఖానస ఆగమయుక్తంగా స్నపనం నిర్వహించారు.

ఈ వేడుకలో ఏలకులు, వట్టివేరు, బాదం, వివిధ రకాల డ్రై ఫ్రూట్స్ , చందనం, నల్ల ద్రాక్ష, రోజ్ పెటల్స్, తులసి దండలు స్వామి అమ్మవార్లకు అలంకరించారు.

టన్ను సంప్రదాయ పుష్పాలు, కట్ ఫ్లవర్స్, పండ్లు, లతలతో వేదికను అలంకరించడమే కాకుండా మలయప్ప స్వామివారికి రూపొందించిన పూలమాలలను చెన్నైకి చెందిన దాత విరాళంగా అందించారు.

# జగన్ వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి ఆగ్రహం

అమరావతి, అక్టోబర్ 5 : తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై సుప్రీంకోర్టు సీబీఐ పర్యవేక్షణలో సిట్ వేయడంపై వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌చేసిన వ్యాఖ్యలను కేంద్ర పౌర విమానాయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం తిరు పతి నుంచి ఢిల్లీకి ఇండిగో విమానాన్ని ప్రారంభించిన సందర్భంగా రేణిగుంట ఎయిర్‌పోర్టులో కేంద్ర మంత్రి మీడియాతో మాట్లాడారు.

సిట్ (రామి) లేదు గిట్ లేదంటూ జగన్ చులకన భావనతో మాట్లాడడం దురదృష్టకరమని పేర్కొన్నారు. తిరుమల లడ్డూ ను అపవిత్రంపై సర్వత్రా విమర్శలు వస్తున్న సమయంలో సుప్రీం కోర్టులో వేసిన పిటిషన్‌పై స్పందించిన కోర్టు సీబీఐ ఆధ్వర్యంలో ప్రత్యేక సిట్‌ను ఏర్పాటు చేసిందని వెల్లడించారు.ఏ అయితే సిట్ విచారణలో వాస్తవాలు బయటకు వస్తాయన్న భయం జగన్‌లో పట్టుకుందని విమర్శించారు. దేశంలో 75 విమానాశ్రయాలు ఉండగా నరేంద్ర మోదీ ప్రధాని అయ్యాక 156కు పెంచారని వివరించారు. పుట్టపర్తి, నెల్లూరు, ఒంగోలులలో స్థలాలను పరిశీలించి నూతన ఎయిర్‌పోర్టులకు శంకుస్థాపన చేస్తామని ప్రకటించారు.

# పిడుగుపాటుకు యువకుడు మృతి

అమరావతి, అక్టోబర్ 5 : నంద్యాల జిల్లా వెలుగోడు మండలంలో పిడుగుపాటుకు యువకుడు మృతిచెందిన సంఘటన శనివారం జరిగింది. వెలుగోడు మండలం రేగడగూడూరు గ్రామానికి చెందిన శివగంగాధర్ గా గుర్తించారు. ఇవాళ ఉదయం మెరుపులతో కూడిన వర్షం కురిసింది.వెలుగోడు మండలం రేగడగూడూరు–అలగనూరు గ్రామాల మధ్య తెలుగుగంగ వంతెనపై ఉంచిన మొక్కజొన్న ధాన్యాన్ని ఆరబెట్టుకొని అక్కడే నిద్రిస్తున్న యువకుడు పిడుగుపాటుకు మృతి చెందాడు. పిడుగుపడడంతో ఉలిక్కిపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. వెలుగోడు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పిడుగులు పడే సమయంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

### తెలుగు సాహితీవనం

## "శేషం విజయలక్ష్మి నరసింహాచార్యులు స్మారక" దీపావళి కవితల పోటీ

హైదరాబాద్, అక్టోబర్ 4 : నలుగురు విజేతలకు ఒక్కొక్కరికి 1,116/– చొప్పున నగదు బహుమానం, సన్మానం ఉంటుంది.

ఏదైనా సామాజిక అంశం పైన 25 పంక్తులు దాటని కవితను మెయిల్ చేయాలి. బహుమతి కరీంనగర్ లో జరిగే "వైజయంతి"పుస్తక ఆవిష్కరణ సభలో ఉంటుంది. విజేతలు తప్పనిసరిగా కరీంనగర్ వచ్చి సన్మానంతో బహుమతిని అందుకోవాలి. కవితలు పంపటానికి చివరి తేదీ: 31.10.2024

Email:sahitivanam82@gmail.com

సంప్రదించుటకు: 94908 05404

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.